Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 354 | కరీంనగర్ | గురువారం 14 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

### - పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 13 : ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ-చికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్,

11 లో

## సిఎం రేవంత్‌ను కలిసిన పలువురు ప్రముఖులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 13 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో పలువురు ప్రముఖలు కలిశారు. వీరంతా సిఎంను మర్యాదపూర్వకంగా కలిసారు. లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి,

11 లో

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

- తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె
- అన్నాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 13 : తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయుఎంఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బల పరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా

11 లో

## తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

- బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు
- మంత్రి సీతక్క స్పష్టీకరణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్, మే 13 : భగీరథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి

11 లో

## హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

- ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పోరేట్ ఆఫీస్
- సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సిఇవో దారా ఖోస్రోషాహి వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 13 : హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సీటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు

11 లో

## జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డి
- సొసైటీలన్నీ సమిష్టిగా సహకరించాలి
- మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 13 : ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రారంభమైన జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్ లోని మీడియా అకాడమీలో జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ

11 లో

## బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

- ఆయనను రక్షించాల్సిన అవసరం మాకేముంది
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే13 : పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే

11 లో

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

### వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 13 : తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే

11 లో

## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు
- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్
- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని




(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

పుదుచ్చేరి, మే 13 : కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెల కొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ

11 లో

## విపక్షనేతల అంటే లెక్కలేదా ?

- మోడీ తీరుపై మండిపడ్డ్ విహెచ్ హనుమంతరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 13 : మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు విహెచ్. హనుమంతరావు విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యం అంటే లెక్కలేకుండా పోయిం దన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్

11 లో

## బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

- పశువుల అక్రమ రవాణాపై నిఘా
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టుల ఏర్పాటు
- ఘర్షణలు తలెత్తకుండా కఠిన చర్యలకు ఆదేశం
- అధికారులతో డిజిపి సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 13 : ఈ నెల 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణెళి లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కే. ఇలంబర్తి తదితరులతో కలిసి డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు.

11 లో

## ములాయం చిన్నకొడుకు ప్రతీక్ హఠాన్మరణం

- ఆస్పత్రికి తీసుకెళ్లే లోగానే మరణించినట్లు వెల్లడి
- ప్రతీక్ మృతికి అఖిలేశ్, సిఎం యోగి సంతాపం



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

లక్నో, మే 13 : సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ములాయం సింగ్ యాదవ్ చిన్న కుమారుడు ప్రతీక్ యాదవ్ (38) హఠాన్మరణం చెందారు. బుధవారం ఉదయం 6:15 గంటల సమయంలో ప్రతీక్ యాదవ్ తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను లక్నో ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రతీక్ యాదవ్ మరణానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాథమిక పరిశీలనలో ఆయన శరీరంపై ఎటువంటి గాయాల గుర్తులు కనిపించలేదని వైద్యులు

11 లో

## బండి భగీరథ్ అప్‌స్కాండింగ్

### నగరంలో పలుచోట్ల పోస్టర్ల కలకలం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 13 : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.

11 లో

## పొదుపు సూత్రాలు తెలంగాణకు నిధులు మాత్రం ఆంధ్రాకా..?



- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 13 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు

11 లో





# నవాబ్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి - గన్ని సంచుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోండి - వర్షాలతో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలి - రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ - నవాబ్‌పేటలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 13 : హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలం నవాబ్‌పేటలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అధికారుల అలసత్వాన్ని సహించబోమని హెచ్చరించారు. గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి, ధాన్యం భారీగా వస్తున్న నేపథ్యంలో గన్ని సంచుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాంట పూర్తయిన ధాన్యం సంచులను లారీల ద్వారా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆకస్మిక వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు రాకుండా ప్రత్యేకంగా ఎంవీఐ అధికారిని నియమించినట్లు వెల్లడించారు. ఎండల తీవ్రత దృష్ట్యా హమాలీలకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఐకేపీ కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, గ్రామ ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేస్తూ కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పేర్కొన్నారు. అనంతరం నవాబ్‌పేట గ్రామానికి చెందిన బోదాసు లలిత-రవి దంపతుల ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గానికి ప్రభుత్వం ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, వాటిలో అనేక ఇళ్లు పూర్తై గృహప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. నవాబ్‌పేటలో జరిగిన గృహప్రవేశ కార్యక్రమం ప్రజల్లో ఆనందాన్ని నింపిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ జూన్ నెల నుంచి ప్రారంభం కానుందని మంత్రి వెల్లడించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వారికి సహకరించాలని సూచించారు. గత పదేళ్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ప్రజలు ఎంతోకాలం ఎదురుచూసినా ఫలితం రాలేదని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తోందన్నారు. ఎలాంటి అవినీతి లేకుండా లబ్ధిదారుల ఎంపిక చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా మరో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటిస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

**- వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి**

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**- జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే13 : ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు, ఒపీ, ఐపి తదితర రిజిస్టర్లను పరిశీలించారు. వైద్య సిబ్బంది వివరాలు, ఖాళీల సంఖ్య, చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య రోజువారి ఐపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, డ్రెస్సింగ్ రూమ్, మహిళా, పురుషుల వార్డులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మానవీయత చూపాలని అన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాలని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణీలు క్రమం తప్పకుండా టీకాలు తీసుకునేలా చూడాలని, సాధారణ ప్రసవాలకు వారిని మానసికంగా సంసిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలో ఉన్న అన్ని సౌకర్యాలు, వసతులను వినియోగించాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది వివరాలు ఇవ్వాలని తెలి పారు. శానిటేషన్ సిబ్బందికి అవసరమైన రక్షణ కవచాలు అందించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ వెంకటరెడ్డి, మెడికల్ ఆఫీసర్ సంపత్ రెడ్డి ఉన్నారు.

# ధాన్యం త్వరితగతిన దింపుకోవాలి

**- ఎలాంటి కొర్రీలు పెట్టొద్దు - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా - రైస్ మిల్లులను తనిఖీ చేసిన కలెక్టర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 13 : సేకరించిన ధాన్యం రైస్ మిల్లులలో త్వరితగతిన దింపుకోవాలని, తద్వారా కొనుగోళ్ల వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండలం రేణిగుంట పరిధిలోగల శ్రీ సాయి శ్రీనివాస, ఆర్కే రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు రవాణా అయిన ధాన్యం అన్ లోడింగ్ విధానాన్ని పరిశీలించారు. సంబంధిత మిల్లులకు కేటాయించిన ధాన్యం, ఇప్పటివరకు మిల్లులకు చేరిన ధాన్యం తదితర వివరాలను పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిల్లర్ తో మాట్లాడుతూ దిగుమతి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. మిల్లుల్లో ధాన్యం త్వరితగతిన దింపుకోవడం ద్వారా మొత్తం కొనుగోలు వేగం పెరుగుతుందని తెలిపారు. మిల్లర్లు, రవాణాదారులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది సమన్వయంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మరింతమంది హమాలీలను, వాహనాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అన్ లోడింగ్ విషయంలో బిల్లు యజమానులు కొర్రీలు విధించరాదని హెచ్చరించారు. సమస్యలను అధికారులకు తెలియజేయాలని, వెనువెంటనే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేశ్వర్, పౌర సరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు. సైదాపూర్ మండలంలోని వెంకెపల్లిలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, దుద్దెనపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ వేగం పెంచాలని ఆదేశించారు. సెంటర్ ఇన్చార్జిలతో మాట్లాడి ఇప్పటివరకు కేంద్రాలకు వచ్చిన ధాన్యం, తూకం వేసిన, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగారు. టార్పాలిన్లు, రవాణా వాహనాలు, హమాలీల గురించి ప్రశ్నించారు. రైతులకు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సెంటర్ ఇన్చార్జీలు ఉన్నత అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. హమాలి రవాణా సమస్యలను అధిగమించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు, పోలీస్ రెవెన్యూ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని, సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.





# సింగరేణి పరిరక్షణకు వ్యయం తగ్గించి ఉత్పత్తి పెంచాలి

**- యంత్రాల పూర్తి స్థాయి సామర్థ్యాన్ని వినియోగించుకోవాలి**

**- గనులపై గురువారం నుంచి మల్టీ డిపార్ట్మెంటల్ కమిటీ సమావేశాలు**

**- ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 13 : సింగరేణి సంస్థలో ఉత్పత్తి-ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచుకోవడం, వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం అధికారులు, కార్మికులు సమిష్టిగా ఎలా పనిచేయాలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాల ద్వారా వివరించడం జరుగుతుందని ఆర్జీ-1 జిఎం లలిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆర్జీ-1 జిఎం కార్యాలయంలోని సమావేశ హాల్లో బుధవారం ఏర్పాటు మీడియా సమావేశంలో గురువారం నుండి గనుల పై నిర్వహించనున్న మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాల ద్వారా కార్మిక వర్గానికి వివరించనున్న కంపెనీ స్థితి గతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాత్రికేయులకు వివరించారు. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే అన్ని గ్రేడుల బొగ్గు రేటు అధికంగా ఉండడంతో ఇతర సంస్థల నుండి తక్కువ ధరకు బొగ్గును కొనుగోలు చేయడానికి పరిశ్రమలు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం కార్మికవర్గం ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. సింగరేణిలో కోట్ల రూపాయలు వెచ్చించి కొన్న యంత్రాలు సామర్థ్యానికి తగిన పని చేయకుండా ఉండడంతో సంస్థకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. భూ గర్భ గనులలో తగ్గుతున్న బొగ్గు ఉత్పత్తికి వ్యయం కూడా పెరుగుతుండడంతో మనం ఇతర బొగ్గు పరిశ్రమల కంటే ఎక్కువ రేటుకు అమ్మాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు. సింగరేణి సంస్థలో కొత్తగా జీడీకే 10 ఓసి, జేకే ఓసీ మైన్, గోలేటి ఓసీ, ఎంవీకే ఓసి, పీవీఎన్ఆర్ ఓసి, మణుగూరు ఓసీ ఎక్స్ టెన్షన్ కానుండగా, 2030 నాటికల్లా 10 గనులు మూతపడనున్నాయని వెల్లడించారు.

# గ్రామపంచాయతీల వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**- త్రాగునీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి - రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ,**

**- గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క - మక్కలు, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి**

**- అభివృద్ధి పనుల్లో, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి - ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి**

**- జిల్లా స్థాయిలో జరుగుతున్న అభివృద్ధిపై పనుల సమీక్షా సమావేశం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 13 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన జిల్లా స్థాయి అభివృద్ధి పనుల సమీక్షా సమావేశన్ని బుధవారంనిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ధనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్,మహబూబాబాద్ శాసనసభ్యులు, మహబూబాబాద్ ఎం.పి పోరిక బలరాం నాయక్, డాక్టర్ భూక్య మురళి నాయక్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో అత్యంత అధిక ప్రాధాన్యతగా త్రాగునీటి సమస్య రాకుండా క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ జిల్లా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగాలని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినందున పద్దుల వారీగా ఖర్చులు చేసి అభివృద్ధికి కృషి చేయాలని, ప్రస్తుతం ధాన్యం మొక్కజొన్న ల కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు, ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి దిశగా పయనిస్తుందని నిత్యం గ్రామాలు పట్టణాల పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు,కొంతమంది అభివృద్ధి పనులపై దుష్ప్రచారం చేస్తున్నారని అట్టివారిని సహించేది లేదన్నారు, రానున్న వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నూతన లైన్లు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు.

ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే జూన్ మాసంలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజ్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, ఉద్యానవన శాఖ యూనివర్సిటీ, జెఎన్టియు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి, మున్సిపల్ తదితర శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగం పెంచి ప్రారంభోత్సవం శంకుస్థాపనలకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. గత సీజన్ తో పోల్చుకుంటే ఈ సీజన్లో మరి ధాన్యం, మొక్కజొన్నల దిగుబడి అధికంగా ఉన్నందున అందుకు తగిన విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బందిని హమాలీలను లారీలను, ట్రాక్టర్స్, డీసీఎం, తదితర సదుపాయాల ద్వారా ధాన్యాన్ని, మొక్కజొన్నలను కొనుగోలు చేసి వెంట వెంటనే తరలించాలని సూచించారు.పంట మార్పిడి విధానం పై రైతులకు అవగాహన కల్పించాలని ధాన్యంతో పాటు ఇతర వాణిజ్య పంటలను సాగు చేసేందుకు ప్రోత్సహించాలని తద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని కోతుల బెడద కూడా లేకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలోని ఐదు మున్సిపల్ ప్రాంతాల అభివృద్ధి కోసం సుమారు 150 నుండి 200 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తూ ఉంటూ ఉండాలని సూచించారు.జిల్లాలో కొంతమంది నిరుపేదలు అటవీ భూములు, పోడు భూముల సమస్యలు ఉన్నందున అర్హులైన నిరుపేదలు అట్టి భూములలో నివాస స్థలాలు ఏర్పరచుకొని ఉన్నారని వారిని అటవీశాఖ అధికారులు కొంత ఇబ్బందులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, పేద ప్రజల ను ఇబ్బందులకు గురి చేయవద్దని ప్రభుత్వ అధికారులు సహకరించాలని కోరారు.మక్కలు,ధాన్యం కొనుగోళ్లలో కొంతమంది కావాలని అసత్య ప్రచారాలు చేస్తున్నారని అందుకు అధికారులు వారు చేస్తున్న పనుల వివరాలను వెంటవెంటనే తెలియపరచాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎవరైనా కబ్జాలకు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు సూచించారు.

ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లలో అధికారులు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడం కోసం ముందస్తు చర్యలు తీసుకొని సాగాలన్నారు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల పనితీరులలో పారదర్శకంగా వ్యవహరించి నిధులను సక్రమంగా వినియోగించే విధంగా పంచాయతీరాజ్ డిపిఓ చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధుల ద్వారా అభివృద్ధి సాధించుకోవాలని తెలిపారు.

మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ జిల్లాలో మక్కలు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లాలో తక్కువ శాతం కొనుగోలు అయిందని తెలిపారు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం నిల్వల కోసం గోదాములను పరిశీలించాలని, ధాన్యాన్ని తరలించడం కోసం వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీలను అధికంగా నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు నిర్వహణ తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ నిర్మాణం వివరాలను కోరగా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ ఇప్పటికే దాదాపుగా పూర్తయిన కార్యాలయ పనులలో పెండింగ్ ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయుటకు చర్యలు తీసుకొని సంబంధిత అధికారులను ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.అనంతరం వారు చెప్పిన సూచనలు సలహాలు స్వీకరించుకుని సంబంధిత అధికారులకు జారీ చేసి ప్రత్యక్షంగా స్వయంగా పనులు సమస్యల పరిష్కారం నిమిత్తం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా ఫారెస్ట్ అధికారి విశాల్ బత్తుల, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, మహబూబాబాద్ పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవ రెడ్డి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, డోర్నకల్, మరిపెడ తొర్రూరు, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్లు , వైస్ చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## ఎన్‌టిఎ వైఫల్యంతో విద్యార్థులకు శాపం !

కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరిం చాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమా ర్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పించడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)–2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయట పడింది.ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటులోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# తమిళ రాజకీయాల్లో నవశకం

# ద్రవిడ కోటలో 'దళపతి' విజయకేతనం!

## కొత్త నాయకత్వం.. కోటి ఆశలు : విజయ్ సర్కార్ ముందున్న అసలు సవాళ్లు



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక నూతన శకం ఆరంభమైంది. దశాబ్దాలుగా ద్రవిడ రాజకీయాలను శాసిస్తున్న డీఎంకే, అన్నా డీఎంకే ద్వంద్వాధిపత్యానికి తెరదించుతూ, వెండితెర వేల్పుగా కోట్లాది మంది అభిమానాన్ని సొంతం చేసుకున్న 'దళపతి' విజయ్ చంద్రశేఖర్ ఇప్పుడు రాజకీయ యవనికపై 'తమిళగ వెట్రి కళగం' సారథిగా అధికార పీఠాన్ని అధిరోహించారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో 144 మంది ఎమ్మెల్యేల మద్దతుతో తన బలాన్ని నిరూపించు కోవడమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మలుపును ఆవిష్కరించారు. ఎం.జి. రామచంద్రన్, జయలలిత వంటి దిగ్గజాల వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ, సినిమా గ్లామర్‌ను పొలిటికల్ పవర్‌గా మార్చుకున్న నేతల జాబితాలో విజయ్ పేరు ఇప్పుడు సమున్నతంగా నిలుస్తోంది.

తమిళనాడు శాసనసభలో జరిగిన ఈ బలపరీక్ష కేవలం అంకెల గారడీ మాత్రమే కాదు, అది ప్రజాతీర్పుకు లభించిన రాజ్యాంగబద్ధమైన ఆమోద ముద్ర. 234 స్థానాలున్న అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా, విజయ్ కూటమికి ఏకంగా 144 మంది సభ్యుల మద్దతు లభించడం విశేషం. ఈ విజయం వెనుక భారీ రాజకీయ కసరత్తు దాగి ఉంది. ఎన్నికల అనంతర పరిణామాల్లో కాంగ్రెస్, వామపక్షాలు, విడుతలై చిరుతైగళ్ కచ్చి మరియు ఐ.యు.ఎం.ఎల్ వంటి పార్టీలతో కూడిన విస్తృత స్థాయి కూటమిని విజయ్ సమర్థవంతంగా నడిపించారు. ముఖ్యంగా అన్నాడీఎంకేలో తలెత్తిన అంతర్గత సంక్షోభం, ఆ పార్టీకి చెందిన 24 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు జెండా ఎగురవేయడం విజయ్‌కు కలిసొచ్చిన అంశం. ఇది కేవలం ఒక వ్యక్తి విజయంగా కాకుండా, పాత రాజకీయ శక్తులపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి ప్రతిరూపంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

విజయ్ రాజకీయ ప్రస్థానాన్ని గమనిస్తే, ఆయన అనుసరించిన వ్యూహాలు అత్యంత శాస్త్రీయంగా ఉన్నాయని చెప్పక తప్పదు. సినీ నటుడిగా శిఖరాగ్రాన ఉన్నప్పుడే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్న ఆయన, 'తమిళగ వెట్రి కళగం'ను కేవలం ఒక ఫ్యాన్ క్లబ్‌గా కాకుండా, ఒక పక్కా కేడర్ బేస్డ్ పార్టీగా నిర్మించారు. ఎన్నికల ప్రచారంలో ఆయన వాడిన అస్త్రాలు... అవినీతి రహిత పాలన, మహిళల రక్షణ, సామాజిక న్యాయం, పారదర్శకత... యువతను, మధ్యతరగతి ఓటర్లను భారీగా ఆకర్షించాయి. దశాబ్దాలుగా అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా విజయ్ ఒక కొత్త ఆశగా ప్రజల ముందు నిలిచారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, ఉచిత నాణ్యమైన వైద్యం, నిరుద్యోగ నిర్మూలన వంటి అంశాలపై ఆయన ఇచ్చిన స్పష్టమైన హామీలు ఓటర్లలో బలమైన నమ్మకాన్ని కలిగించాయి.

అయితే, అధికారంలోకి రావడం ఒక ఎత్తు అయితే, సంక్లిష్టమైన తమిళనాడు వంటి రాష్ట్రాన్ని పాలించడం మరో ఎత్తు. విజయ్ ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు పరిపాలనా అనుభవం. సినీ రంగం నుంచి నేరుగా ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నేతగా, ఆయనపై ప్రజల అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలను చేరవేయడం ఆయనకు అగ్నిపరీక్ష వంటిదే. గతంలో ఎంజీఆర్, జయలలిత వంటి వారు కూడా సినీ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ, వారు పార్టీలో ఏళ్ల తరబడి పనిచేసి పాలనా మెలకువలు నేర్చుకున్నారు. కానీ విజయ్ విషయంలో అంత సమయం లేదు; ఆయన తక్షణమే తన ప్రతిభను నిరూపించు కోవాల్సిన అవసరం ఉంది.

ఆర్థిక సవాళ్లు విజయ్ ప్రభుత్వాన్ని వెన్నాడే మరో కీలక అంశం. ప్రస్తుతం తమిళనాడు అప్పుల భారం సుమారు 7.5 లక్షల కోట్ల రూపాయలకు పైగా ఉంది. ఒకవైపు అప్పుల భారం, మరోవైపు భారీ సంక్షేమ హామీలు...ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం కత్తిమీద సాము వంటిదే. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్థిక భరోసా, యువతకు ఉపాధి భృతి వంటి పథకాల అమలుకు భారీగా నిధులు అవసరం. వీటి కోసం కొత్త పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించాల్సి ఉంటుంది. పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలతో పెట్టుబడుల విషయంలో పోటీ పడుతూ, తమిళనాడును 'బిలియన్ డాలర్ ఎకానమీ' వైపు నడిపించడం విజయ్ విజన్–2030లో అత్యంత ముఖ్యం. రాజకీయ స్థిరత్వం అనేది కూటమి ప్రభుత్వాల్లో ఎప్పుడూ ఒక ప్రశ్నార్థకమే. ప్రస్తుతం విజయ్‌కు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్, వామపక్షాలు మరియు వి.సి.కె వంటి పార్టీల సిద్ధాంతాలు వేర్వేరు. దళిత ఓటు బ్యాంకును శాసించే తిరుమావళవన్ (వి సి కె) ఆకాంక్షలు, మైనారిటీల అవసరాలు, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అనుసరించే విధానాలు... వీటన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడం సాధారణ విషయం కాదు. మంత్రివర్గ విస్తరణలో పదవుల పంపకం మొదలుకొని, విధానపరమైన నిర్ణయాల వరకు ప్రతి అడుగులోనూ భాగస్వామ్య పక్షాలను సంతృప్తి పరచాల్సి ఉంటుంది. ఒకవేళ ఎక్కడైనా పొరపచ్చాలు వస్తే, ప్రధాన ప్రతిపక్షాలైన డీఎంకే మరియు అన్నాడీఎంకే ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

సామాజిక న్యాయం విషయంలో తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ సున్నితంగా ఉంటాయి. పెరియర్, అన్నాదురై వంటి మహనీయులు నిర్మించిన సామాజిక పునాదులపైనే నేటి రాజకీయాలు ఆధారపడి ఉన్నాయి. రిజర్వేషన్లు, కుల గణన, భాషా పరిరక్షణ వంటి అంశాలపై విజయ్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఆయన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ముఖ్యంగా హిందీ వ్యతిరేక ఉద్యమాలు, నీట్ పరీక్ష రద్దు వంటి భావోద్వేగ అంశాల్లో తమిళనాడు ప్రజల మనోభావాలను విజయ్ ఎలా గౌరవిస్తారనేది ఆసక్తికరం. తన మొదటి ప్రసంగంలోనే ఆయన 'సామాజిక సమానత్వం' గురించి మాట్లాడటం ద్వారా తన సిద్ధాంతాన్ని స్పష్టం చేశారు. కానీ ఇది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ నియామకాల్లోనూ, సంక్షేమ ఫలాల పంపిణీలోనూ ప్రతిఫలించాల్సి ఉంది.

యువత ఓట్లు విజయ్ విజయానికి ప్రధాన చోదక శక్తిగా నిలిచాయి. నేటి తరం యువతకు కేవలం ఉచిత పథకాలు మాత్రమే కాదు, గౌరవ ప్రదమైన ఉపాధి కావాలి. స్టార్టప్ హబ్‌గా చెన్నైని మార్చడం, మధురై, కోయంబత్తూర్ వంటి పట్టణాల్లో ఐటీ రంగ



విస్తరణ, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో విజయ్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఆశిస్తున్నారు. ఒకప్పుడు అభిమానులుగా ఉన్నవారు ఇప్పుడు ఓటర్లుగా మారి తమ హక్కులను డిమాండ్ చేస్తున్నారు. ఈ అంచనాలను అందుకోలేకపోతే, అదే యువత వ్యతిరేక గళం విప్పే ప్రమాదం కూడా ఉంది.

జాతీయ రాజకీయాల కోణంలో చూస్తే విజయ్ ఎదుగుదల ఒక కొత్త చర్చకు దారితీసింది. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ అస్తిత్వం బలపడుతున్న తరుణంలో, సినిమా గ్లామర్ మరియు యువత రాజకీయ చైతన్యం ఎలా ప్రభావితం చేస్తాయనే దానికి విజయ్ ఒక ప్రయోగశాలగా మారారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు తమిళనాడులో పట్టు చిక్కడం కష్టమవుతున్న తరుణంలో, విజయ్ వంటి కొత్త తరం నాయకులు ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రతినిధులుగా నిలుస్తున్నారు. ఇది భవిష్యత్తులో జాతీయ రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించవచ్చు.

అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గడం అనేది విజయ్ సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో మొదటి మెట్టు మాత్రమే. సినిమా షూటింగ్‌లో రీటేక్‌లు ఉంటాయి కానీ, రాజకీయాల్లో ప్రజా తీర్పు విషయంలో రీటేక్‌లు ఉండవు. ప్రతి నిర్ణయం, ప్రతి చర్య ప్రజా క్షేత్రంలోనే పరీక్షించబడుతుంది. ప్రజల ఆశలు, కూటమి భాగస్వాముల సర్దుబాటు, ఆర్థిక నిర్వహణ, సామాజిక సమతు ల్యత...ఈ నాలుగు స్తంభాలపైనే విజయ్ సర్కారు మనుగడ ఆధారపడి ఉంది. ఒక సాధారణ నటుడి నుంచి అసాధారణ ప్రజా నాయకుడిగా ఎదిగిన విజయ్, తమిళనాడు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి 'మంచి ముఖ్యమంత్రి'గా పేరు తెచ్చుకుంటారా? లేదా కేవలం ఒక రాజకీయ ప్రయోగంగా మిగిలి పోతారా? అన్నది రాబోయే ఐదేళ్ల పాలనలో తేలిపోతుంది. ప్రస్తుతానికి మాత్రం తమిళనాడు గడ్డపై కొత్త రక్తం, కొత్త ఆలోచనలు పరిపాలనా పగ్గాలు చేపట్టడం శుభపరిణామం. ఆయన తన శక్తిసామర్థ్యాలతో తమిళనాడును అభివృద్ధి పథంలో నడిపించాలని ఆశిద్దాం.

**– వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

## బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు

### 6 నుంచి 15 శాతానికి పెంచిన కేంద్రం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 13 : బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తాజాగా పెంచింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచింది. దీంతో, మొత్తం దిగుమతుల సుంకం 15 శాతానికి చేరింది. గతంలో ఇది 6 శాతంగా ఉండేది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పతనమైన నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచింది. బంగారం వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం భారత్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇక ఈక్విటీ మార్కెట్‌లో రాబడులు మందగించిన నేపథ్యంలో గతేడాది భారత్‌లో బంగారానికి డిమాండ్ పెరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఆధారిత ఎక్స్‌చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 186 శాతం మేర పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండి దిగుమతుల కట్టడి కోసం ఇటీవల ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్‌టీ విధించింది. దీంతో, బ్యాంకులు దిగుమతులకు దాదాపు నెల రోజుల పాటు బ్రేక్ చెప్పాయి. ఫలితంగా ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల నాటి కనిష్ఠాన్ని తాకాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను తట్టుకునేందుకు దేశ ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యం

### - పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం
### - ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 13 : పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదనిరిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎఓఈ) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు.

ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

### - కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని
### - అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
### - పలు రాష్ట్రాల సిఎంలు కూడా పొదుపుబాట

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 13 : పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించి నట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్‌పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్‌పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్‌పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడిం చారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

# భక్తి మార్గంతోనే మానసిక ప్రశాంతత సాధ్యం



**- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
**- రామన్నపేటలో ఘనంగా శ్రీ పెద్దమ్మ తల్లి ప్రతిష్ఠాపన మహోత్సవం**
**- ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 13 : భక్తి మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని, ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించి లోకకల్యాణానికి దోహదపడతాయని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని 60వ డివిజన్ పరిధిలోని రామన్నపేటలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ పెద్దమ్మ తల్లి, పోతురాజు, సింహవాహన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల్లో భక్తి భావనను పెంపొందించడమే కాకుండా గ్రామాల్లో సుఖశాంతులు వెల్లివిరియడానికి దోహదపడతాయని అన్నారు. సమాజంలో సామరస్య వాతావరణం నెలకొల్పడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ మహోత్సవాలు బుధవారం ప్రధాన ఘట్టంతో ముగిశాయి. ఉదయం 9.24 గంటలకు శుభముహూర్తంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య యంత్రస్థాపన, బింబస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. పంచముఖి నాగేంద్రుడు, జంట నాగుల ప్రతిష్ఠాపన, నేత్రోన్మీలనం, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. మంత్రి పర్యటనతో రామన్నపేట ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, రామన్నపేట పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతుల్లో జాప్యం లేకుండా అన్‌లోడింగ్ చేయాలి

**- లారీ చేరిన 24 గంటల్లోపు ధాన్యం అన్‌లోడింగ్ పూర్తి చేయాలి - హమాలీల సమస్య ఉన్నచోట ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి - రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలి - ఎలాంటి కటింగ్‌లు అనుమతించొద్దు - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 13 : జిల్లాలో ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు సకాలంలో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ శ్రీహర్ష పెద్దపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి, పూసాల, సుగ్లాంపల్లి ప్రాంతాల్లో గల పలు రైస్ మిల్లులను సందర్శించి ధాన్యం దిగుమతి, అన్‌లోడింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. కాట్నపల్లిలోని పల్లా ఇండస్ట్రీస్, శివపార్వతి రైస్ మిల్, రిషి రైస్ మిల్, రంగనాథ రైస్ మిల్, శ్రీ రాజరాజేశ్వరీ రైస్ మిల్, పూసాల శివసాయి రైస్ మిల్, మణికంఠ రైస్ మిల్, సుగ్లాంపల్లి రాధారమణ రైస్ మిల్లులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్‌లు, అక్రమ కోతలు అనుమతించబోమని స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే స్వీకరించాలని సూచించారు. లారీ రైస్ మిల్లుకు చేరిన 24 గంటల్లోపు ధాన్యం అన్‌లోడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. పీపీసీలు, రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత లేదా ఇతర సమస్యలు ఉన్నచోట వెంటనే



అవసరమైన చర్యలు తీసుకొని సమస్యను అధిగమించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. ఈ పర్యటనలో డీటీసీఎస్ మహేష్, రవీందర్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# విద్యారంగ అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర



**- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 13 : ప్రజాపాలన - ప్రగతీ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జెడ్ పి హెచ్ ఎస్ కురవి పాఠశాల యందు బుధవారం నిర్వహించిన కురవి,సిరోలు మండల సర్పంచుల ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రత్యేకించి విద్యారంగ అభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామ పాఠశాల బలోపేతమే గ్రామాభివృద్ధికి పునాది అని స్పష్టం చేశారు. విద్యను ప్రజా ఉద్యమంగా మార్చాలని ప్రతి గ్రామంలో పాఠశాలల అభివృద్ధి పనులకు సర్పంచులు ముందుండాలని అన్నారు. విద్యార్థుల హాజరు, శుభ్రత, భద్రత, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులపై గ్రామ పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. డ్రాప్‌అవుట్స్‌ను పూర్తిగా నిర్మూలించడం సర్పంచుల తక్షణ లక్ష్యం కావాలని అన్నారు. గ్రామం కలిసి ముందుకు తీసుకెళ్లే సమిష్టి బాధ్యతగా పేర్కొన్నారు.తల్లిదండ్రులను పాఠశాల కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇటీవలి పాఠశాల సందర్శనల్లో చూసిన మంచి పద్ధతులను పంచుకున్నారు.ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీచింగ్, స్వచ్ఛత పట్ల విద్యార్థుల్లో పెరుగుతున్న అవగాహన వంటి అంశాలను ప్రశంసించారు. అన్ని గ్రామాల్లో ఇలాంటి మోడల్ స్కూల్స్ నిర్మించేందుకు సర్పంచులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఉపాధ్యాయులు,గ్రామసర్పంచులు,పాఠశాల కమిటీలు,విద్యాశాఖ అధికారుల మధ్య సమన్వయం పెంపు ద్వారా మాత్రమే నాణ్యమైన విద్యను అందించగలమని కలెక్టర్ స్పష్టంగా చెప్పారు.క్షేత్రస్థాయిలో సర్పంచులు అన్ని అంశాలపై దృష్టి పెట్టాలని యువత డ్రగ్స్ నివారణ చర్యలు,రోడ్డు భద్రత కార్యక్రమాలు,బాల్య వివాహాలు నివారణ చర్యలు తదితరులు విషయాల పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆల్వాల సత్యనారాయణమూర్తి మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ నాయక్, ఇస్లావత్ లచ్చిరాం నాయక్, ఏ సి జి ఈ మందుల శ్రీరాములు. ఎఫ్ ఏ ఓ బానోత్ శంకర్ నాయక్, సీఎంఓ వంగ సురేష్ ఏ ఎస్ సి సంతోష్ ఎంపీడీవో,లు వీరబాబు మరియు మహమ్మద్ గౌస్ పాషా స్థానిక ప్రధానోపాధ్యాయులు ఎండి వహీద్.ఆర్పీలు ప్రవీణ్ శివప్రసాద్ లింగమూర్తి ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**- రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**
**- చెక్‌పోస్టులు, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా**
**- అవాంఛనీయ ఘటనలకు తావులేదు**
**- బక్రీద్ పండుగ శాంతిభద్రతలపై డీజీపీ దృశ్య సమీక్ష**
**- పాల్గొన్న వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 13 : రాష్ట్రవ్యాప్తంగా మే 27వ తేదీన జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల నిర్వహణపై రాష్ట్ర పోలీసు శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి దృశ్య సమీక్ష సమావేశంలో ఆయన భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ దృశ్య సమీక్ష సమావేశంలో వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, పోలీసు అధికారులతో కలిసి పాల్గొని, జిల్లాలో బక్రీద్ సందర్భంగా చేపడుతున్న భద్రతా చర్యలు, ప్రత్యేక బందోబస్తు ప్రణాళికలు, చెక్‌పోస్టుల పర్యవేక్షణ, పోలీస్ బృందాల మోహరింపు తదితర అంశాలను



డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డిజిపీ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక బందోబస్తు, సున్నిత ప్రాంతాల్లో అదనపు పోలీస్ పికెటింగ్, చెక్‌పోస్టుల ఏర్పాటు, రాత్రి గస్తీ, డ్రోన్ మరియు సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక సైబర్ నిఘా ఏర్పాటు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సామాజిక సామరస్య పరిరక్షణ పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న డీజీపీ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం ఇవ్వకుండా జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై కఠిన నిఘా కొనసాగించాలని ఆదేశించారు ఈ సమావేశంలో వనపర్తి డీఎస్పీ, గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ, బాలాజీ నాయక్, వనపర్తి జిల్లా వెటర్నరీ అధికారి వెంకటయ్య గౌడ్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ శ్రీ రాంబాబు,మున్సిపల్ స్టాంట్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై, రామేశ్వర్ రెడ్డి అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# తాలు పేరుతో అబద్ధాలు ఆడొద్దు



**- ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు ట్రక్ షీట్ ఇవ్వాలి**
**- రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదు**
**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 13 : తాలు, తడక పేరుతో రైతులను దోపిడీకి గురిచేస్తే ఎంతమాత్రం సహించేదిలేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రైస్ మిల్లర్లను హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు ట్రక్ షీట్ అందజేయాలని స్పష్టం చేశారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ధాన్యం, మక్కల కొనుగోళ్లపై రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, డీఆర్‌డీఏ, సహకార, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు అనంతరం రైతులకు ట్రక్ షీట్ ఇవ్వడంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ధాన్యం, మక్కల కొనుగోళ్లు ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ప్రభుత్వం ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకుందని తెలిపారు. సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంటా పూర్తయిన తర్వాత రైతుకు సంబంధం ముగుస్తుందని, ట్రక్ షీట్ జారీ చేయకుండా ఆలస్యం చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలు పేరుతో అబద్ధాలు చెప్పొద్దని మిల్లర్లకు సూచించిన ఎమ్మెల్యే, పలుమార్లు తాలు, తరుగులు తీయవద్దని చెప్పినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మిల్లర్ల సమస్యలు ఉంటే ప్రభుత్వం పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని, కానీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, అలాంటి పరిస్థితులను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన తర్వాత ధాన్యం భద్రత, రవాణా, ట్రక్ షీట్ జారీ బాధ్యత కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, మిల్లర్లదేనని స్పష్టం చేశారు. కాంటా పూర్తయ్యే వరకు మాత్రమే రైతు బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులను మరింత ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. "ఇది రైతు చేసిన పాపమా?" అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదాములు, రవాణా, కాంటా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



# సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేస్తాం

**- ఖనిలో ఇందిరమ్మ చీరలు పంపిణీ**
**- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 13 : మహిళల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ ఇందిరానగర్‌లో బుధవారం నిర్వహించిన "ఇందిర మహిళా శక్తి -- ఇందిరమ్మ చీరల పంపిణీ" కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరు మీద ఉన్న ఇందిరానగర్ నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మహిళల అభ్యున్నతి, కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి మహిళ ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలు చూపిస్తున్న ప్రేమ, అభిమానాలు, ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ తనకు బలాన్నిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. "మీ చిరునవ్వు బాధ్యత మేము తీసుకుంటాం" అన్న నినాదంతో ప్రజా సేవలో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా చైతన్యంలో కళలది ప్రత్యేక పాత్ర

**- ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 13 : సమాజంలో ప్రజలను చైతన్యవంతం చేయటంలో కళలకు ప్రత్యేక స్థానం ఉందని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వంకా గోపాల్ అన్నారు. బుధవారం వనపర్తి ఆఫీసులో ప్రజానాట్యమండలి నాలుగవ రాష్ట్ర మహాసభ గోడపత్రికలను కళాకారులు, నేతలతో కలిసి ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఒక గొప్ప ఉపన్యాసం కంటే పాట, నాటకం, ఒగ్గు కథ, గొల్ల సుద్దులు వివిధ రూపాల కళలు ఎక్కువగా ప్రజల ను కదిలిస్తాయన్నారు. అందువల్ల జిల్లాలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కళలు కళారూపాల అభివృద్ధికి విశేష కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా చైతన్యంతో పాటు పార్టీ అభివృద్ధికి కళలు పట్టుగొమ్మలుగా ఉపయోగపడతాయని, జిల్లాలో కళాబృందాల ఏర్పాటుకు అందరూ తోడ్పాటు అందించాలన్నారు. జీవితకాలం ఆటపాట లతో ప్రజలను చైతన్యపరిచిన వృద్ధ కళాకారులు జీవించలేని స్థితిలో ఉన్నారని వారిని ఆదుకునేందుకు పెన్షన్ ఇవ్వడంతో పాటు ఇండ్లు, ఇళ్లస్థలాలు మంజూరిలో వారికి ప్రత్యేక కోటా కేటాయించాలన్నారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి ఆవిర్భావం మే 25న జరిగిందని, ఆరోజు హైదరాబాద్ మగ్దుంభవన్ లో రాష్ట్ర నాలుగవ మహాసభ జరుగుతుందని 26న ప్రతినిధుల సభ ఉంటుందని జిల్లా కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కళావతమ్మ, శ్రీరామ్, రమేష్, కృష్ణవేణి, జయమ్మ, గంధం నాగరాజు,శేఖర్, చిన్న కుర్మన్న, వంశీ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాను స్పోర్ట్స్ హబ్ గా మార్చడానికి కృషి

**- భారీగా విచ్చేసిన క్రీడాకారులు - మహబూబాబాద్ గడ్డ-ఆటలకు అడ్డ - రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 13 : 45వ నేషనల్ షూటింగ్ బాల్ నేషనల్ ఛాంపియన్ షిప్, సబ్ జూనియర్స్ బాయ్స్, గర్ల్స్ పోటీలు మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయినాయి. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధిగా రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి విచ్చేసి పోటీలను ప్రారంభించారు.క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత ఇస్తోందని వేం నరేందర్ రెడ్డి తెలిపారు. మహబూబాబాద్‌ను భవిష్యత్తులో ఒక స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు.భారతదేశ నలుమూలల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ముందుండి కృషి చేసిన సహాయక చైర్మన్లు, పి ఈ టి, పీడీ, షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు,కార్యదర్శులు,నిర్వాహక బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే పేట.టి ఎస్. మహబూబాబాద్ జిల్లా ప్రెసిడెంట్ కొప్పుల శంకర్ జనరల్ సెక్రటరీ ఐలయ్య లను ప్రత్యేకంగా అభినందించారు.ముందుండి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా క్రీడలకు ఎప్పుడూ అండగా యువత ప్రతిభకు వేదికగా నిలుస్తుంది అని ఈ సందర్భంగా తెలిపారు. వారితో పాటు ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, మహబూబాబాద్ యంపి బలరాంనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 13 : వనపర్తి పట్టణ పరిధిలోని 12వ వార్డు రాజనగరంలో బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ ఎంతో బలోపేతం అవుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి ఇంటికి చేరువవుతున్నాడు వలన ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా అనే ఎగరాలని పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేణులు, పెద్దలు యువకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నక్కరాణి రాజు, వనపర్తి పట్టణ మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు, పెద్దలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలుగవద్దు


## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 13 : ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరుగుద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. అల్లాదుర్గం మండలం గడి పెద్దాపురం గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లు లకు తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తనిఖీలో తదితరులు పాల్గొన్నారు.

# కాటారం ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన రవీందర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 13 : జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ నూతన ఆర్డీవోగా రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలకు సంబంధించిన కేసులను ప్రాధాన్యతగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని పట్టా పత్రాలు సక్రమంగా ఉండి కూడా పెండింగ్‌లో ఉన్న భూముల విషయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, పారదర్శకంగా సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఆర్డీవో రవీందర్ తెలిపారు.



# 99 రోజుల ప్రజాపాలనపై అవగాహన సదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 13 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం మండల కేంద్రం వేంసూరులోని రైతు వేదికలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యా వారోత్సవాల సందర్భంగా ఈ నెల 11 నుండి 17 వరకు జరుగుతున్న విద్యా కార్యక్రమాల నేపథ్యంలో మూడవ రోజు సర్పంచులకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పలు సంక్షేమ, విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మండల తహసీల్దార్ మాణిక్ రావు, ఎంపీడీవో కావ్య, ఎంఈఓ వెంకటేశ్వరరావు పాల్గొని ప్రభుత్వ విద్యాభివృద్ధి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు.



# సత్తుపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 13:ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య బుధవారం విస్తృతంగా పర్యటించారు. వివిధ సామాజిక, కుటుంబ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. పట్టణానికి చెందిన ఇమ్మనేని కిరణ్‌బాబు-నళిని కుమారి దంపతుల కుమారుని రిసెప్షన్ వేడుకకు హాజరైన సండ్ర వెంకట వీరయ్య నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్తుపల్లి మండలం బి. గంగారం జలగం నగర్‌కు చెందిన ఉప్పుతల నరసింహ-నాగమణి దంపతుల కుమార్తె లక్ష్మీ భవాని వివాహ వేడుకలో పాల్గొని వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. అలాగే పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామానికి చెందిన చలమాల నరసింహారావు-సంధ్యారాణి దంపతుల కుమారుడు అఖిల్ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. మరోవైపు కల్లూరు మున్సిపల్ కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేపై ద్విచక్ర వాహనాల రాకపోకలు

## పెరుగుతున్న ప్రమాదాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 13 : ఖమ్మం జిల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేపై వాహనాలు నిర్లక్ష్యంగా సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్కే ఎంట్రన్స్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో బైక్‌లు హైవేపైకి వెళ్తున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా వేగంగా దూసుకెళ్తున్న భారీ వాహనాల మధ్య ద్విచక్ర వాహనాలు ప్రయాణిం చడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. తక్షణమే హైవే అధికారులు, పోలీసు శాఖ స్పందించి గ్రీన్ ఫీల్డ్ హైవేపై ద్విచక్ర వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధిస్తూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# హామీలను నెరవేర్చుతున్న అంతర్గాం టిటిఎస్ సర్పంచ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 13 : ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షిస్తూ అనేక వాగ్దానాలు చేస్తూ హామీల వర్షం కురిపిస్తూ ఓట్లు ముగిసిన అనంతరం ప్రజాప్రతినిధులుగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవసరాలకు ఉపయోగించుకునే ఈ రోజుల్లో అంతర్గాం టిటిఎస్ సర్పంచ్ అంగోత్ రవికుమార్ నాయక్ ఈ తరం యువనేతగా నిన్నటి సర్పంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చి ఇతర గ్రామాల సర్పంచులకు ఎన్నికల హామీలను గుర్తుచేసే దిక్సూచిగా మారాడు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రం టిటిఎస్ అంతర్గాం సర్పంచ్ అంగోత్ రవి కుమార్ నాయక్ రాజకీయాలకు కొత్త అయినప్పటికీ సామాజిక సేవలో విద్యావేత్తగా తనదైన శైలిలో అట్టడుగు పేద వర్గాలకు అండగా ఉండాలనే లక్ష్యంతో అబ్దుల్ కలాం ట్రస్టు ద్వారా జనంలో సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిన్నటి సర్పంచ్ ఎన్నికల్లో యువత... సామాజిక సేవ ద్వారా...రవికుమార్ నాయక్ సేవలను పొందిన జనం సర్పంచి పదవి బరిలోకి దింపి అంతర్గాం టిటిఎస్ సర్పంచ్‌గా రవికుమార్ నాయకును గెలిపించుకున్నారు. ఎన్నికల హామీలలో భాగంగా సర్పంచ్ రవికుమార్ నాయక్ టిటిఎస్ అంతర్గాం గడ్డమీద నివసించే కడు నిరుపేద వారాల సుగుణమ్మ ఇల్లు కూలిపోయి గూడు నీడ కరువై తల్లడిల్లుతున్న దీనస్థితిని ఎన్నికల ప్రచారంలో సుగుణమ్మ ఇంటికి వెళ్లిన రవికుమార్ నాయక్ చలించి స్పందించారు.

తాను సర్పంచ్‌గా ఎన్నికల్లో గెలిచిన ఓడిన ఇంటి నిర్మాణం చేయించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని అబ్దుల్ కలాం ట్రస్ట్ చేయుత అతని మిత్ర బృందం సహాయంతో సుగుణమ్మకు నూతన గృహాన్ని నిర్మించారు. బుధవారం హైదరాబాద్ కుందన సాయి ఐటి సొల్యూషన్స్ సీఈవో అబ్దుల్ కలాం ట్రస్ట్ సభ్యులు స్వర్ణపురి మహేష్ చేతుల మీదుగా సుగుణమ్మ కోసం నిర్మించిన నూతన గృహాన్ని ప్రారంభించి సర్పంచ్ అంగోత్ రవికుమార్ నాయక్ అప్పగించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు స్వచ్ఛంద సేవల నాయకులు పలు పార్టీల నేతలు హాజరై గూడు నీడలేని కడు నిరుపేద సుగుణమ్మకు ఇంటి నిర్మాణం చేయించిన అబ్దుల్ కలాం ట్రస్టు సేవాస్ఫూర్తిని అభినందించారు.




# మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన బండి సాయి భగీరథ్ ను అరెస్టు చేయాలి

## - క్యాబినెట్ నుండి మంత్రి బండి సంజయ్ ను బర్త్ రఫ్ చేయాలి - ఖని చౌరస్తాలో ఆందోళన చేపట్టిన గులాబీ నేతలు - బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 13 : మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన ఉన్మాది బండి సాయి భగీరథ్ ను వెంటనే పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. గోదావరిఖని పట్టణ చౌరస్తా లో బుధవారం గులాబీ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సాయి భగీరథ్ చిత్ర పటానికి చెప్పుల దండ వేసి చెప్పులతో కొట్టారు.

అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్ చిత్రపటం పై షేమ్ షేమ్ అంటూ గీతలు గీశారు. ఈ సందర్భంగా పోలీసులకు పార్టీ శ్రేణులకు మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి బండి సాయి భగీరథ్ చేస్తున్న అకృత్యాలను బండి సంజయ్ తన పదవిని ఉపయోగించుకొని కాపాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశా రు. పైగా అదే బాలిక కుటుంబం పై హాని ట్రాప్ ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రధానమంత్రికి సీఎం రేవంత్ రెడ్డి లొంగిపోయాడని, దీంతో సాయి భగీరథ్ ను సిట్ విచారణ పేరుతో బెయిల్ కు ఇచ్చేందుకు అవకాశం ఇస్తున్నారని పేర్కొన్నారు. కేసును తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. భగీరథకు అరెస్టు చేసి రాష్ట్రంలో ఉన్న మహిళలకు భరోసా కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ తస్లీమా భాను, పర్స స్వాతి, జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, బూర్ల వంశీకృష్ణ, బొట్ల పోచం, కృష్ణస్వామి, కొండ సురేష్, పోయిల రవి, ఉదయ్, శైలజ, కుమారి, రజిత, ఇంద్ర, భాగ్యలక్ష్మి సరోజన ధరణి అనసూయ అశ్విని తదితరులు ఉన్నారు

# గుండెపుడిలో గ్రామ ప్రజల సొంత ఖర్చుతో బ్రిడ్జి నిర్మాణం



## ప్రారంభించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 13 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని గుండెపుడి గ్రామంలో గ్రామ ప్రజల అవసరాల కోసం సుమారు రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని బుధవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. గ్రామ ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా స్థానికంగా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, తల్లిదండ్రుల పేరుమీద గ్రామ ప్రజల ఉపయోగార్థం బ్రిడ్జి నిర్మించాలని భావించడం ఎంతో గొప్ప విషయమన్నారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించిన పొన్నెకంటి కుటుంబాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛందంగా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాగుల్ మీరా, కాల్లూరు వెంకటేశ్వరరావు, కొమ్మిని పాండురంగారావు, దుద్దుకూరి సుమంత్, కొమ్మిని నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు...

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మే 13 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పెంపుదలకు సంబంధించి చేపట్టిన పనుల ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు మంజూరైన పనులు, పూర్తయిన పనుల వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సరైన వెంటిలేషన్, త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం, తరగతి గదుల్లో ఫ్యాన్లు వంటి కనీస మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అవసరమైన చోట టాయిలెట్స్, తాగునీటి సదుపాయం, విద్యుత్ వసతుల కల్పన వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. పాఠశాలల నిర్వహణతో పాటు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అన్ని పనులు పూర్తయిన పాఠశాలలకు



పెయింటింగ్ నిర్వహించేందుకు అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి పరిపాలన మంజూరు పొంది పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టగల పనులను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ఎంపీడీవోలు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించినప్పుడు టాయిలెట్స్, తాగునీరు, ఇతర కనీస వసతుల పరిస్థితిని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా జరగాలి



## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 13 : జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా జరగాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఏఎస్పి రాజేష్ మీనాతో కలిసి పెద్దమందడి మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి పాక్స్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వీరాయిపల్లి సమీపంలోని ఎఫ్‌పిఓ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో దాన్యం నమోదు రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఇన్చార్జ్ లకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా జరగాలని సూచించారు. తేమశాతం నిర్ధారించుకుని వేగంగా కాంటాక్ట్ చేసి కేటాయించిన మిల్లుకు తరలించే విధంగా చూడాలన్నారు. రెవెన్యూ శాఖ తరపున కేటాయించిన ప్రత్యేక అధికారి కొనుగోలు కేంద్రం వద్ద ఈ పది రోజులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీయగా, ఈ క్రమంలో రైతులు కలెక్టర్ తో మాట్లాడుతూ లారీల ట్రాన్స్పోర్ట్ సమస్య ఉందని, అందువల్లనే ధాన్యం మిల్లులకు తరలించడం ఆలస్యం అవుతుందని తెలియజేశారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ లారీలను అదనంగా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైస్ మిల్ సందర్శన.ఖిలా గణపురం మండల పరిధిలోని సోలిపురం గ్రామ శివారులో ఉన్న సింధు ఆగ్రో రైస్ మిల్లు ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లు ఆవరణలో వేచి ఉన్న ధాన్యం లారీలను వేగంగా అన్లోడ్ చేయించాలని సూచించారు.

# ఘాట్ రోడ్డు పనులు ప్రారంభం

## - పరిశీలించిన ఎమ్మెల్యే కోవాలక్ష్మి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 13 : ఆసిఫాబాద్ - ఉట్నూరు ప్రధాన రహదారిపై ప్రయాణికుల ఇబ్బందులను గమనించి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి తీసుకున్న ప్రత్యేక చొరవతో రోడ్డు మరమ్మత్తు పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. గత రెండేళ్లుగా కెరమెరి ఘాట్ నుండి టింకపల్లి వరకు నిలిచిపోయిన ఈ పనుల గురించి ఎమ్మెల్యే ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. పెండింగ్ బిల్లుల విషయంలో కాంట్రాక్టర్ ముంతాజ్ కు భరోసా ఇచ్చి పనులను ప్రారంభించారు .ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం పవర్‌గూడ నుండి టింకపల్లి వరకు ప్యాచ్ వర్క్ పనులు మొదల య్యాయి. నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో రోడ్డు ఇబ్బందులను తొలగించి, సురక్షిత ప్రయాణానికి బాటలు వేసిన ఎమ్మెల్యేకి నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసిన దండు రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 13 : నూతనంగా ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరిం చిన రవీందర్‌ను రాష్ట్ర ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్యతో కలిసి ఆర్డీవో రవీందర్‌కు శాలువా కప్పి, బొకే అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన పదవీకాలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షి స్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు కొండగొర్ల రాంనారాయణ, ఆత్మకూరి కుమార్ యాదవ్ తదిత రులు పాల్గొన్నారు.

# డిప్యూటీ మేయర్ ఛాంబర్‌లో ఆశీనులైన పాతపల్లి ఎల్లయ్య

## - శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, మేయర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), మే 13 : రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని బుధవారం తన ఛాంబర్‌లో తొలి సారిగా ఆశీనులైన డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్యకు రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్, ఎమ్మెల్యే సతీమణి మనాలీ రాజ్ ఠాకూర్, రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ, పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



# రైతులకు అండగా జిల్లా యంత్రాంగం

## - వరి ధాన్యం తరలింపులో వేగం పెంచాలి

## - జిల్లా ఎస్పీ నరసింహ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, మే 13 : అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ భరోసా ఇచ్చారు. వరి ధాన్యం సేకరణ, రవాణా, దిగుమతిలో మిల్లర్లు వేగం పెంచాలని సూచించారు. మంగళవారం సూర్యాపేట రూరల్ పరిధిలోని జాతీయ రహదారి-65పై టేకుమట్ల వద్ద ట్రాన్స్‌పోర్ట్ శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల అధికారులతో కలిసి లారీ యజమానులు, డ్రైవర్లతో ఎస్పీ సమావేశమయ్యారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం చివ్వెంల మండల పరిధిలోని నవరత్న ఫార్ బాయిల్డ్ రైస్ మిల్‌ను సందర్శించి ధాన్యం దిగుమతి, సేకరణ ప్రక్రియను పరిశీలించారు. హమాలీలతో మాట్లాడి వేగంగా ధాన్యం దిగుమతి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల కల్లాల్లో ఉన్న వరి ధాన్యం తడిసి రైతులకు నష్టం కలగకుండా మిల్లర్లు పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. చిన్న తరహా రైస్ మిల్లర్లు కూడా ముందుకు వచ్చి ధాన్యం సేకరణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ, రోడ్డు రవాణా శాఖ, రెవె న్యూ, సివిల్ సప్లై శాఖల సమన్వయంతో రవాణా వాహనాలు సమ కూరుస్తున్నామని తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని, జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సహకరిస్తోందని భరోసా ఇచ్చారు. అలాగే ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున రైతులు, కార్మికులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్,రవాణా శాఖ అధికారులు, ఎస్సై లు బాలు నాయక్, మహేష్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్ మీద చెత్త.. జరిమానా విధింపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరి ఖని), మే 13 : బహిరంగ ప్రదేశాలలో చెత్త పడవేస్తున్న వారికి రామగుండం నగర పాలక సంస్థ జరిమానా విధించింది. బుధవారం రామగుండం నగర పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామికి మజీద్ కార్నర్ లో కొన్ని దుకాణాల ముందు చెత్త కుప్పలు దర్శనమి వ్వడంతో సదరు నిర్వాహకులకు జరిమానా విధించవల్సిందిగా మునిసిపల్ పారిశుధ్య విభాగం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్, జవాన్ ఎం.తిరుపతి సదరు దుకాణ నిర్వాహకులకు రూ 1000 రూపాయల చొప్పున జరిమానా విధించారు. పది దుకాణాల నుండి రూ 11,500 రూపాయల జరిమానాగా వసూలయ్యాయని సానిటరీ ఇన్స్ పెక్టర్ సంపత్ తెలిపారు.

# ఉపాధి హామీ పనికి ఒకరి బదులు మరొకరు హాజరు కావద్దు

**- నిబంధనలు ఉల్లంఘిస్తే మేట్లపై కఠిన చర్యలు: ఏపీడీ విజయ భాస్కర్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 13:ఉపాధి హామీ పథకం పనుల్లో ఒక కూలీకి బదులుగా మరొకరు హాజరు కావద్దని, అలా జరిగితే సంబంధిత మేట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ భాస్కర్ రెడ్డి హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం తొమ్మిదో మైలు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కోటల్ల గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న మంచినీళ్ల కుంట చెరువు పూడికతీత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో పనిచేస్తున్న 115 మంది వేజ్ సీకర్లతో మాట్లాడిన ఆయన, పని ప్రదేశంలో మంచినీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలీ రోజుకు రూ.307 వేతనం పొందేలా కొలత ప్రకారం పనిచేయాలని సూచించారు. పని ప్రదేశానికి అవసరమైన పరికరాలను ప్రతి ఒక్కరూ వెంట తెచ్చుకుని పనులు నిర్వహించాలని ఆదేశించారు. విధిగా ప్రతి రోజు ప్రతి కూలీ రెండు ఫోటోలు దిగడం తప్పనిసరి అని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది, సాంకేతిక సహాయకులు ప్రతిరోజూ పనులను పర్యవేక్షిస్తూ వేజ్ సీకర్లకు మార్కింగ్, ఈ-కేవైసీ ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం తొమ్మిదో మైలు తండా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించిన విజయ భాస్కర్ రెడ్డి, నర్సరీని సక్రమంగా నిర్వహించాలని కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి రాజా, అదనపు కార్యక్రమ అధికారి ఈజీఎస్ కాళంగి శ్రీనివాస్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమారి, టీఏ సురేష్, ఎఫ్ఏ భద్రం, మేట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# నవ లిమిటెడ్ సహకారంతో సరోజ వృద్ధాశ్రమానికి గృహోపకరణాల అందజేత

**సిఎస్ఆర్ కార్యక్రమాలను కొనియాడిన సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 13:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని నవ లిమిటెడ్ పరిశ్రమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా బుధవారం భద్రాచలం మానవసేవ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరోజ వృద్ధాశ్రమానికి వంట సామాగ్రి, పరుపులు, మంచములు, గృహోపకరణాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవసేవ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు శ్రీమతి సరోజ మాట్లాడుతూ, వృద్ధాశ్రమంలోని వృద్ధుల అవసరాలను నవ లిమిటెడ్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి వంట సామాగ్రి, పరుపులు, మంచములు, గృహోపకరణాలు, దోమతెరలు, దుప్పట్లు, కండువాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఇందుకు నవ లిమిటెడ్ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నవ లిమిటెడ్ డీజీఎం (ఫైనాన్స్) ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ, సంస్థ గత 46 సంవత్సరాలుగా ఆరోగ్యం, విద్య, జీవనోపాధి రంగాల్లో సమాజాభివృద్ధికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. ముఖ్య అతిథి మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, మానవతా దృక్పథంతో వృద్ధాశ్రమానికి అవసరమైన సామగ్రిని అందజేయడం ద్వారా నవ లిమిటెడ్ సంస్థ సమాజంపై ఉన్న బాధ్యతను చాటుకుందని కొనియాడారు. ఇటువంటి సీఎస్ఆర్ కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సీఎస్ఆర్ సీహెచ్ శ్రీనివాసరావు, శ్రావణ్, సాయి, సీఎస్ఆర్ సిబ్బంది, వృద్ధాశ్రమ వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ బొల్లోరుగూడెంలో కలకలం రేపిన మృత శిశువు తల

**హృదయ విదారక ఘటనతో ఉలిక్కిపడ్డ స్థానికులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 13:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ పట్టణం బొల్లోరుగూడెంలో నవజాత మృత శిశువు తల కనిపించడం తీవ్ర కలకలం రేపింది. పాల్వంచ ఏరియా మున్సిపల్ కార్పొరేషన్ మొదటి డివిజన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బుధవారం ఉదయం గోవర్ధన్ అనే వ్యక్తి తన ఇంటి వాకిలిని శుభ్రం చేస్తుండగా వ్యర్థాల మధ్య అనుమానాస్పద వస్తువు కనిపించింది. దగ్గరగా పరిశీలించగా అది నవజాత మృత శిశువు తలగా గుర్తించి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే పాల్వంచ పట్టణ ఎస్ఐ నాగరాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, స్థానిక కార్పొరేటర్ సీరపు సుగుణా రెడ్డికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. తలను చూసిన స్థానికుల నుంచి వివరాలు సేకరించి, మృత శిశువు తలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక అంచనా ప్రకారం, ఆ శిశువు జన్మించి రెండు నుంచి మూడు రోజులే అయ్యి ఉండవచ్చని భావిస్తున్నారు. ఎవరైనా గుర్తుతెలియని మహిళ శిశువును గుడ్డలో చుట్టి అక్కడ పడేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అనంతరం శునకాలు శరీరాన్ని పీక్కుతిని ఉండవచ్చని, తలను కూడా ఈడ్చుకెళ్తుండగా స్థానికులు గమనించి తరిమివేసినట్లు సమాచారం. ఈ హృదయ విదారక ఘటన స్థానికులను తీవ్ర కలవరానికి గురిచేసింది. మృత శిశువు ఎవరు, ఘటనకు కారణాలేమిటి అనే అంశాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుగుణా రెడ్డి, ఇంటి యజమాని గోవర్ధన్ మీడియాతో మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు సమాజానికి మచ్చ తెస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని మహిళలు శిశువులను ఇలా వదిలేయకుండా, కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన "ఊయల" వంటి పథకాల ద్వారా లేదా దేవాలయాలు, అనాథ శరణాలయాల వద్ద వదిలితే ఆ శిశువులు ప్రాణాలతో బతికే అవకాశముంటుందని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజం చైతన్యవంతం కావాలని కోరారు.



# అథ్లెటిక్స్‌లో బాలికలు రాణించాలి

**- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి**

**- విజేతలకు బహుమతులు అందజేసిన కార్పొరేటర్లు సింధు తపస్విని, నూకల సరిత**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 13:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు బుధవారం పాల్వంచ శ్రీనివాస్ కాలనీలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో నిర్వహించబడ్డాయి. ఈ పోటీలకు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి ముఖ్య అతిథిగా హాజరై ఒలింపిక్ జెండా ఊపి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలురతో పాటు బాలికలు కూడా అధిక సంఖ్యలో అథ్లెటిక్స్‌లో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. తీవ్ర ఎండను సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు వరుసగా రాష్ట్ర ఛాంపియన్లుగా నిలుస్తుండటం గర్వకారణమని, అదే స్ఫూర్తితో రాబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని కోరారు. పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు అంతర్జాతీయ క్రీడాకారిణి, ఏడో డివిజన్ కార్పొరేటర్ సింధు తపస్విని, ఐదో డివిజన్ కార్పొరేటర్ నూకల సరిత బహుమతులు అందజేశారు. సింధు తపస్విని మాట్లాడుతూ, ఉత్తమ శిక్షణ, కఠోర శ్రమ, ఏకాగ్రతతో సబ్ జూనియర్ స్థాయి నుంచే అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందితే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు. నూకల సరిత మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే అథ్లెట్లకు తల్లిదండ్రులు ప్రోత్సాహం అందిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ మాట్లాడుతూ, ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ కోచ్‌లు డి. మల్లికార్జున్, ఎర్రయ్య నిర్వహించారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

**- బండి సంజయ్ బెదిరింపు వ్యాఖ్యలు సరికావు: జేబీపీ - ప్లకార్డులతో నిరసన తెలిపిన పార్టీ శ్రేణులు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 13:కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, అలాగే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ సెంటర్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యెర్రా కామేష్ మాట్లాడుతూ, ఈ నెల 8వ తేదీన బండి సంజయ్ తనయుడిపై పోక్సో కేసు నమోదై ఐదు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని పెద్దలు కలిసి ఈ కేసును నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. బాధ్యతగల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు చిక్కకుండా దాచిపెట్టి తెలంగాణ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని నిలదీశారు. ఈ కేసులో తనకు ఎలాంటి ప్రమేయం లేకపోతే భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామిపై ప్రమాణం చేసి బాధితురాలు లేదా ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడలేదని చెప్పగలరా అని సవాల్ విసిరారు. ఇటీవల బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కేసును నిర్వీర్యం చేసేలా, అధికారులను మరియు రాజకీయ పార్టీలను బెదిరించే ధోరణిలో ఉన్నాయని ఆరోపించారు. ఈ విషయంలో హైకోర్టు సుమోటోగా స్పందించి బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సిట్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం సరైంది కాదని, ఇప్పటికే ఈ వ్యవహారంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ రావ్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరునాయక్, వినయ్, సోనూ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 15న భద్రాద్రి జిల్లాకు తక్కెళ్లపల్లి రవీందర్ రావు

**- బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు - పార్టీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం**





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 13:బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జి, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఈ నెల 15న జిల్లా పార్టీ కార్యాలయానికి రానున్నట్లు ఆ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై జిల్లాలోని ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం మీడియా సమావేశం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటల కల్లా జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని రేగా కాంతారావు కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్షులు, టౌన్ పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, టీబీజీకేఎస్ నాయకులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, విద్యార్థి, యువజన నాయకులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, ఉద్యమకారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఐటీఐలో అడ్మిషన్స్ కోసం దరఖాస్తు చేసుకోండి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 13:భద్రాద్రి జిల్లా పాల్వంచ నీట్స్ ఐటిఐ కళాశాల నందు 2026-2027 సంవత్సరానికి గాను అడ్మిషన్ల కొరకు ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ దేవీలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పదవ తరగతి పాసై ఉండి, ఐటిఐలో చేరాలనుకుంటే ఆన్లైన్లో ఒరిజినల్ ధృవపత్రాలు సమర్పించాలని తెలిపారు. ఐటిఐ లో చేరాలనుకునే విద్యార్థులు మే 1 నాటికీ 14 సంవత్సరాలు నిండి ఉండాలని స్పష్టం చేసారు. ఆన్లైన్ దరఖాస్తు లు ఈనెల 14 నుండి జూన్ 8 తారీకు వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. నీట్స్ ఐటిఐ నందు ఎలక్ట్రీషియన్ 80 సీట్లు, ఫిట్టర్ 40సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు, సెల్ :8985848939 ఫోన్ నెంబర్ కు సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.




# పేద ప్రజల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు - ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 13:ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమం, వైద్య సేవలు, పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సీఎం ఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి రూరల్, అర్బన్, ఘనపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి అర్బన్, రూరల్ ప్రాంతాలకు చెందిన 46 చెక్కులను రూ.18,45,700 విలువతో అందజేయగా, ఘనపూర్ మండలానికి చెందిన 31 చెక్కులను రూ.9,74,300 విలువతో పంపిణీ చేశారు. అదేవిధంగా 23వ వార్డుకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కూడా లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం ముఖ్యమని, సీఎం ఆర్ఎఫ్ పథకం ద్వారా అనేక కుటుంబాలకు వైద్య సహాయం అందుతోందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీసీసీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు - ఎమ్మెల్యే

## విద్యార్థులపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి - కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 13:ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడిగా భావిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు, సర్పంచులతో వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని సరస్వతి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, పాఠశాలలు విద్యాబుద్ధులు నేర్పే దేవాలయాలంటూ అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఒక ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపిక చేసి సెమీ రెసిడెన్షియల్ పాఠశాలగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు 200 శాతం, డైట్ చార్జీలు 40 శాతం పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ మరింత బలంగా ఉందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. సర్పంచులు తమ పరిధిలోని పాఠశాలలను తరచుగా తనిఖీ చేసి విద్యాబోధన, మెనూ అమలు తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. పాఠశాలల్లో క్రీడా మైదానాలు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. అలాగే ప్రతి పాఠశాలలో లైబ్రరీలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించడంతో పాటు ఉద్యోగ సాధనకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాలలపై నుంచి విద్యుత్ లైన్లు వెళ్తున్న ప్రాంతాల జాబితా అందజేస్తే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, విద్యా వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వారం రోజుల పాటు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి రోజు నిర్వహించాల్సిన కార్యక్రమాలను విద్యాశాఖకు నిర్దేశించినట్లు తెలిపారు. సర్పంచులు విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఈ సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థులు బాగా చదివి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్వో వసంతకుమారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, వివిధ మండలాల ఎంఈఓలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# వడ్లు, మక్కలు కొనుగోలు చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 13:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో మక్కలను, వడ్లను యుద్ధ ప్రాతిపదికన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని,మామిడి తోటల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు సంబంధిత అధికారులకు బుధవారం వినతి పత్రాలు అందజేశారు. అధికారులు సానుకూలంగా స్పందించారు. ఏఐకేఎంఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి మాట్లాడుతూ, మొక్కజొన్నలు, వడ్లనుకొనడంలో ప్రభుత్వం నుండి తీవ్ర జాప్యం జరుగుతుందని, అకాల వర్షంతో మక్కలు, వడ్లు, మామిడి కాయలు పంటలు తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. దళారీలు తక్కువ రేటుకు కొంటున్నారని,రైతులకు జరుగుతున్న ఈ నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ప్రభుత్వం పెట్టిన యాప్ పై ఆదివాసి రైతులకు అవగాహన కల్పించలేదని,సిగ్నల్ సమస్య కూడా ఉందని,ఈ సమస్యను పరిగణలోకి తీసుకొని రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చి, కలెక్టర్ వెంటనే క్షేత్ర పరిశీలనకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా నాయకులు పూనెం రంగయ్య, భూక్య హర్ష్య, బి.రామచంద్రు, ఎట్టి నరసింహారావు, పూనెం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# మే 24న కంపేటి రాజయ్య సంస్మరణ సభను జయప్రదం చేయాలి

**- ఎస్. సి.ఈ.యు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మంద నరసింహారావు, తుమ్మల రాజారెడ్డి.**

**- సిఐటియు జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 13 : సిఐటియు నాయకుడు కామ్రేడ్ కంపేటి రాజయ్య సంస్మరణ సభను ఈ నెల 24న భూపాలపల్లి పట్టణంలో నిర్వహిస్తున్నామని, సంఘటిత-అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంద నరసింహారావు, తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. సిఐటియు జయశంకర్ భూపాలపల్లి జిల్లా విస్తృత సమావేశం శ్రామిక భవన్‌లో జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడిన నాయకులు రాజయ్య సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, గుడిసెవాసులు, భూములు కోల్పోయిన రైతుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా, సిఐటియు జిల్లా అధ్యక్షుడిగా, ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ నాయకుడిగా, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజయ్య సేవలందించారని తెలిపారు. సింగరేణి పరిరక్షణ, కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ఆదాయపన్ను మినహాయింపు, మహిళా కార్మికులకు క్రచ్ సౌకర్యం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోసం ఆయన పోరాడారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, బ్యాంకు జీతాలు, క్వార్టర్స్ సౌకర్యం కోసం కూడా రాజయ్య ఉద్యమించారని చెప్పారు. ఆశా, అంగన్‌వాడీ, మున్సిపల్, భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనలోనూ ముందుండి పోరాటం చేశారని తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం రాజయ్య చేసిన పోరాటాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. రాజయ్య ఆశయ సాధన కోసం కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుర్రం దేవేందర్, సిహెచ్ రవికుమార్, మేకల మహేందర్, కొండ లక్ష్మి, విజయలక్ష్మి, బండారి బాబు, తోట రమేష్, గుగులోతు శ్రీకాంత్, కుమ్మరి శ్రీను, బాబురావు, మడికొండ స్వామి, బైరం బిక్షపతి దొబ్బెట లక్ష్మి, రేణిగుంట్ల రాజేశ్వరి, రత్నం అశోకు, గంగ అక్క , జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లిలో రేపు గ్రంథాలయ దినోత్సవ పుస్తక ప్రదర్శన

## విద్యా వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, మే 13:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మే 15న గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ శాఖ గ్రంథపాలకుడు ఆర్.నాగన్న తెలిపారు. పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన పుస్తకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, పుస్తక ప్రియులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పుస్తక ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్. నాగన్న కోరారు.

# పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వెంటనే పంపిణీ చేయాలి

**- అప్పగించకపోతే స్వాధీనం చేసుకుంటాం - సేవ్ కొత్తగూడెం కన్వీనర్ జలాల్ అహ్మద్.**

**- భద్రాద్రి జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పరిశీలన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రికొత్తగూడెం, మే 13:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి స్వాధీనం చేసుకునే కార్యక్రమం చేపడతామని సేవ్ కొత్తగూడెం కన్వీనర్, ఆవాజ్ పట్టణ కార్యదర్శి జలాల్ అహ్మద్ హెచ్చరించారు. బుధవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం వెన్నెలనగర్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జలాల్ అహ్మద్ మాట్లాడుతూ, వెన్నెలనగర్‌లో సుమారు 300 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తికి చేరుకున్నప్పటికీ చిన్న చిన్న మరమ్మతుల పేరుతో పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. మైనర్ రిపేర్లు పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు, కొత్తగూడెం ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సమస్య రెండు దశాబ్దాలుగా కొనసాగుతోందని, గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రకటనలకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం కొనసాగుతుందా లేదా అనే



విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పూర్తయిన ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని, లేకపోతే దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అవసరమైతే లబ్ధిదారులతో కలిసి ఇండ్ల ఆక్రమణ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండసంజయ్ కుమారుడిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జలాల్ అహ్మద్ డిమాండ్ చేశారు.

# వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 13:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ఆదేశానుసారం జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో పాల్వంచ మండలం జగన్నాథపురం పీహెచ్‌సీ పరిధిలోని పినపాక పట్టినగర్, సంగం, నాగారం ఆరోగ్య ఉప కేంద్రాలలో బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమాలపై పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ సేవల అమలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, వ్యాక్సిన్ నిర్వహణ విధానాలను పరిశీలించారు. సిబ్బందికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన సేవలు అందించాలని సూచనలు ఇవ్వబడినట్లు తెలిపారు. ప్రజల్లో టీకాలపై అవగాహన పెంపొందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సమయానికి వ్యాక్సినేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ నాగభూషణం, హెచ్ఎస్ కృష్ణయ్య పాల్గొన్నారు.



# కోదండరామ్‌కు భద్రాద్రి జిల్లా టీజేఎస్ నాయకుల ఘన సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 13: తెలంగాణ జనసమితి (టీజేఎస్) పార్టీ నాలుగో ప్లీనరీ సమావేశంలో ప్రొఫెసర్ ఎం. కోదండరామ్‌ను వరుసగా నాలుగోసారి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న జిల్లా నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయన ఎన్నికను సమర్థించారు. నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను భద్రాద్రి జిల్లా టీజేఎస్ నాయకులు బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై కోదండరామ్ సమర్థవంతంగా పోరాటం కొనసాగిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు తిప్పన సిద్దులు, మల్లెల రామనాదం, టీజేఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బరగడి దేవదానం, జిల్లా కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ కే. ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఏ. రవూఫ్, ఎస్. ప్రభాకర్ రెడ్డి, వి. శ్రీనివాస్, రామారావు, మురళి, పుల్లయ్య, రాంబాబు, శివ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ వ్యవహారంతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

**- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే కారణం: బీఆర్ఎస్ యువజన విభాగం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 13:నీట్ పరీక్ష వ్యవహారంలో చోటుచేసుకున్న పరిణామాలు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బోశెట్టి రవిప్రసాద్ విమర్శించారు. బుధవారం మణుగూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడి చదివి, భారీ మొత్తంలో పరీక్ష రుసుములు చెల్లించి, తమ భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో నీట్ పరీక్షకు హాజరయ్యారని అన్నారు. అయితే ప్రభుత్వాల నిర్లక్ష్యం, అశ్రద్ధ కారణంగా ప్రశ్నాపత్రం లీక్ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే సుమారు లక్షా 29 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, వారి ఆశలపై ప్రభుత్వాలు నీళ్లు చల్లినట్లయిందని విమర్శించారు. ఈ పరిస్థితిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం లీక్ కారణంగా ఇతర ప్రవేశ పరీక్షలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు.

# రేపు పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రానికి మంత్రులు పొంగులేటి, ఉత్తమ్

## కొనుగోలు ప్రక్రియపై క్షేత్రస్థాయిలో పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 13:పాలేరు నియోజకవర్గ పరిధిలోని పాలేరు గ్రామంలో ఇటీవల ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం సందర్శించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రులు నేరుగా కొనుగోలు కేంద్రానికి చేరుకుని ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ఏ విధంగా జరుగుతోంది, మద్దతు ధర అమలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి అనే అంశాలను మంత్రులు స్వయంగా రైతులను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తూకంలో పారదర్శకత, గోనె సంచుల లభ్యత, సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నారని పేర్కొన్నారు.

# అక్రమ నిర్మాణాలను తొలగించాలి

## ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 13 : కాలువలపై అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కోరారు. వార్డు సందర్శనలో భాగంగా నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి బుధవారం 51 వ డివిజన్ అశోక్ నగర్,లక్ష్మీ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలపై అక్రమ నిర్మాణాల మూలంగా ప్రవాహ పరిమాణశీ పెరిగినప్పుడు నీళ్లు ఇళ్లలోకి రావడం, నీరు నిలిచి పోయి దుర్వశీదశీ వ్యాపించి ప్రజలు అనారోగ్యానికి గురికావడం జరుగుతుందని అన్నారు. అలాగే వీధిలోకి అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ ,ఆటో వచ్చేలా విశాలంగా ఉంచుకోవాలని సూచించారు. ఖాళీ స్థలం కనబడితే చెత్త వేయడం సరికాదని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేసిన వారికి భారీ జరిమానాలు విధించాలని అన్నారు. పదేండ్లుగా కాలువల్లో నిలిచిపోయిన సిల్ట్ ను స్పెషల్ డ్రైవ్ ప్రారంభించి తొలగింపు ప్రక్రియ చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నెలా పదిరోజులుగా జరుగుతున్న ఈ పనుల్లో పాలు పంచుకుంటున్న మేయర్,డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లు, అధికారులు,సిబ్బందిని ఆయన అభినందిశీచారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది బాగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు.లక్ష్మీ నగర్ రోడ్లను విశాలంగా తీర్చిదిద్దే ప్రక్రియ చురుగ్గా సాగుతున్నదని త్వరలో గణేష్ నగర్ వైపు రోడ్డు నిర్మాణం ప్రారంభం అవుతుందని అన్నారు. సహకరిస్తున్న వ్యా పారులకు కృతజ్ఞతలు తెలి పారు. నగరాన్ని విద్యా, వైద్య, వ్యాపార కేంద్రంగా, అద్భుత నగరంగా తీర్చి దిద్దే ప్రయత్నశీ లో రామ గుండం నగరవాసులందరూ భాగస్వాములు కావాలని అన్నారు. తమ స్వంత ఇంటి లాగా నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ సందర్భంగా అశోక్ నగర్



లో మురుగు నీటి కాలువలో జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నీళ్లు సాఫీగా ప్రవహించడానికి, ఎప్పటికప్పుడు యంత్రాలతో శుభ్రం చేయడానికి వీలుగా కాలువను కొంచెం వెడల్పు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆకారపు రేఖ మహేష్, నగర పాలక ఎస్ ఇ గురువీర, టిపిఎస్ నవీన్, డిఇ ఆఫ్తాబ్, ఎఇ మీర్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సానిటరీ ఇన్స్ పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, మే 13 : కొను గోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించాలని, కొను గోలు ప్రక్రియలు వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుధవారం ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలోని వెన్నెల ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం మాయిశ్చర్ మిషన్ పని తీరును,తూర్పల మిషన్,కొనుగోలు రికార్డ్ లను పరిశీలించి పలు వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరి కొను గోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. రోజువారీగా ఎంత ధాన్యం సేకరిస్తున్నారు, రైస్ మిల్లులకు ఎన్ని లోడ్ లారీలు వెళ్తున్నాయి, ట్రక్ షీట్లను వెనువెంటనే ఆన్లైన్ లో ఎంట్రీలు చేస్తున్నారా, హమాలీలు సరిపడా సంఖ్యలో ఉన్నారా అని ఆరా తీశారు. ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు వివరాలతో కూడిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు,రైతులు అప్రమత్తంగా ఉండాలని ధాన్యం తడవకుండా టర్పాలిన్ లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రైతులు కేంద్రాలకు తరలించిన ధాన్యం ప్రభుత్వం నిర్దేశించిన తేమ కు లోబడి ఉంటే వెంటనే తూకం నిర్వహించి కొనుగోలు చేయాలన్నారు. ఓపిఎంఎస్ రోజువారి ధాన్యం కొనుగోలు వివరాలను ఎంట్రీ చేయాలని, మిల్లర్లు త్వరితగతిన అక్నా లజీమెంట్ ఇవ్వాలని, వేసవి కాలం దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుకోవాలని, ధాన్యం తరలించడానికి తగినన్ని లారీలను కూడా అందుబాటులో ఉంచే విధంగా చేసుకోవాలని అన్నారు. రైతులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని,మిల్లులకు పంపిన ధాన్యం మిల్లర్లు ఎలాంటి ఆంక్షలు లేకుండా దిగుమతి చేసుకుంటున్నారా లేదా అని అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్, డిఎం కృష్ణవేణి, డిఆర్‌డిఏ చంద్రశేఖర్, డిసిఒ, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటును అందించాలి

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ములుగు, మే 13 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజా ప్రతినిధులు తోడ్పాటును అందించాలని, నాణ్యమైన విద్య ప్రమాణాలకు చిరునామగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తున్నాయని, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిరంతరాయంగా కృషి చేస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక విద్య వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు బుధవా రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల విద్యా కార్యక్రమాల పై విద్యాశాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర గేయాలపన తో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించాలని, విద్య ప్రమాణాలు పెంపొందించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి గ్రామాలలో, మున్సిపాలిటీ పరిధిలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తూ పాఠశాలలో 100 శాతం విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్ర వ్యాప్తంగా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలవడం గర్వకారణంగా ఉందని తెలిపారు. సమాజ నిర్మాణం లో బలమైన పునాది వేయడానికి పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం, సమాజ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి పలు చారిత్రాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలకు సహాయ సహకారాలు అందించడం ద్వారా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ప్రభుత్వ విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగంగా లైబ్రరీల ఏర్పాటుపై దృష్టి సారించాలని దీనిద్వారా స్థానిక ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూరతాయని సూచించారు. గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ దృష్టి సారించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వేలు, నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేయడానికి మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. స్థానిక కౌన్సిలర్లు ప్రభుత్వ పాఠశాలలను తరచు పర్యవేక్షిస్తూ పాఠశాలల నిర్వహణ ఉపాధ్యాయుల బోధన పద్ధతులపై దృష్టి పెట్టాలని, విద్యార్థి సంఖ్య పెంపొందించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల క్రమశిక్షణతో ములుగు జిల్లా పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య, ఉచిత యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ మధ్యాహ్నం భోజనం కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ ఆసియా షాహిన్, జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ మాసాంతం వరకు పూర్తి చేయాలి

## ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 13 : ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ ఈ నెల చివరి వరకు 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండలాల తహసిల్దార్లు, సూపర్వైజర్లతో ఆసిఫాబాద్ నియోజకవర్గస్థాయి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ మాసాంతం వరకు 100 శాతం పూర్తి చేయాలని, నియోజకవర్గంలోని మండలాల తహసిల్దార్లు, ఎ పి ఎం లు, సూపర్వైజర్లు మ్యాపింగ్ శాతం తక్కువ ఉన్న ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. మరణించిన ఓటర్లు, గ్రామంను వదిలి వెళ్ళిపోయిన ఓటర్లను గుర్తించి నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. సెర్ప్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారం తీసుకోవాలని, రాజకీయ పార్టీలు తమ పార్టీ తరపున బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను అందించాలని, మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని తెలిపారు. అనంతరం తహసిల్దార్లతో ధాన్యం కొనుగోలు, గోనె సంచుల లభ్యత, మొక్కజొన్న కొనుగోలు, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ధ్రువపత్రాల జారీ, పెం డింగ్ అంశాలపై సమీక్షించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రక్రియ వేగవంతం చేయడానికి ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు.



భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సూపర్వైజర్లు, గిర్దావార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం వద్దు

## రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 13 : నిర్మల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం దిలావార్ పూర్ టోల్ ప్లాజా, లోకేశ్వరం మండలంలోని పలు రైస్ మిల్లులను ఆయన స్వయంగా సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు చేరుకున్న లారీలను 24 గంటల్లోపు తప్పనిసరిగా అన్‌లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్‌లు, అక్రమ కోతలు అనుమతించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హమాలీల



కొరత ఉన్న ప్రాంతాల్లో వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ధాన్యం దిగుమతిలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే పీపీసీలు, రవాణా విభాగం, రైస్ మిల్లుల మధ్య సమన్వయం కొన సాగించాలని ఆదేశించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడింగ్ చేసి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సివిల్ సప్లై అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సూర్యరావ్ పాల్గొన్నారు.



# శిశు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవు

## జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 13 : శిశు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తెలిపారు. ఆడ శిశువును రూ.3 లక్షలకు అమ్మిన తల్లి తండ్రులు కూల్చరం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులు తమ 4వ శిశువును అమ్ముకున్నారనే విషయం మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణలో కన్న తల్లి తండ్రులు తమ పాపను రూ.3 లక్షలకు అమ్మకున్నారని నిర్ధారించుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ లో తగు చర్యల కొరకై పిర్యాదు చేశామని,ఈ విచారణలో తేలిందన్నారు. కూల్చరం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులకు ఇదివరకే ముగ్గురు సంతానం ఉండగా తేదీ 27.3.2026 నాడు మెదక్‌లోని ఎంసిహెచ్ హాస్పిటల్‌లో ఆడ పాప జన్మించడం జరిగిందని,పాపను దంపతులిద్దరూ రూ.3 లక్షలకు కొంత మంది మధ్యవర్తుల ద్వారా అల్లినగర్,ములుగు మండలం సిద్దిపేట జిల్లాకు చెందిన దంపతులకు విక్రయించడం జరిగించడం పేర్కొన్నారు. ఈ విషయం పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి పాపను తీసుకువచ్చి మహిళా శిశు సంక్షేమ అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. అధికారులు సంబంధిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పాపను తదుపరి సంరక్షణ నిమిత్తం సంగారెడ్డిలోని శిశుగృహకు తరలించి ఆశ్రయం కల్పించామని, జిల్లాలో అక్రమ దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేస్తూ, ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవాలంటే ప్రభుత్వ నియమ నిభందనల ప్రకారం మహిళా శిశు సంక్షేమ శాఖ లోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# రైతులకు అండగా పోలీస్ అధికారులు

## ధాన్యం రవాణాకు సహకరించాలి

## లారీ యజమానులకు పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి విజ్ఞప్తి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటి (గోదావరిఖని), మే 13 : రైతులు పండించిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు కేంద్రాలు, గోదాములకు తరలించేందుకు అవసరమైన వాహనాలను అందించాలని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి గోదావరిఖని లారీ అసోసియేషన్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గంగానగర్‌లో ఉన్న లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరి ఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాక్స్, వ్యవసాయ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కోరారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ధాన్యం రవాణా సజావుగా జరిగేందుకు తగిన సంఖ్యలో లారీలు,ఇతర వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల కష్టానికి తగిన ఫలితం అందేలా అధికా రులు, రవాణాదారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ధాన్యం నిల్వలు ఆలస్యం కాకుండా వేగవంతమైన రవాణా సదుపాయం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. లారీ అసోసియేషన్ సభ్యులు కూడా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉం చుకుని అవసరమైన వాహనాలను అందించి పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,అసోసియేషన్ సభ్యులు,లారీ యజమానులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌పోస్ట్‌లను పరిశీలించిన జిల్లా ఎస్పీ నితిక పంత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే 13 : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల ప్రాంతంలోని పశువుల విక్రయశాలను జిల్లా ఎస్పీ నికిత పంత్ బుధవారం పరిశీలించారు. అక్కడి నిర్వాహకులు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పశువులకు సరిపడా నీరు, దాణా, గడ్డి అందించేలా చర్యలు తీసుకోవాలని, వాటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే ఆవుల కొనుగోలు, అమ్మకాలు సంతలలో నిషేధమని స్పష్టం చేశారు. పశువుల రవాణా, విక్రయాలకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం సిర్పూర్ టి మండలంలోని పెద్దబండ చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన ఎస్పీ అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు అందించారు. చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సరైన ధ్రువపత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌటాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న బుట్టలతో కేదార్‌నాథ్ ఆలయ నమూనా

## బేయర్ కంపెనీ వినూత్న ప్రదర్శన

## ప్రదర్శన క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, మే 13 : భైంసా మండలం లోని మాటేగాం గ్రామ సమీపంలోబేయర్ కంపెనీ మొక్క జొన్నబుట్టలతో కేదార్ నాథ్ నమూనా ఆలయాన్ని నిర్మించి, వారం రోజుల పాటు భక్తుల సందర్శన కోసం ఉంచారు.. బుధవారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ హాజరై ఆలయం లో పూజలు నిర్వహించారు. కంపెనీ వారు వినూత్న రీతిలో ప్రదర్శన చేపట్టడం అభినందనీయమన్నారు. మరింత నూతన వంగడాలను కంపెనీలు సృష్టించి అధిక దిగుబడి సాధించేలా పాటు పడాలని సూచించారు. కంపెనీ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించి, రైతు లాభం పొందేలా చూడాలన్నారు. బేయర్ కంపెనీ డి కోల్డ్ మొక్కజొన్న 9217 రకం బాగుందన్నారు. కాలానికి అనుగుణంగా పంటలను వేస్తూ రైతులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నమూనా ఆలయాన్ని సందర్శించడానికి వచ్చిన ఎమ్మెల్యేకి స్వాగతించి, శాలువాతో సన్మానించారు. అదేవిధంగా ఈ సందర్శన క్షేత్రాన్ని చూడడానికి పెద్ద మొత్తంలో ప్రజలు తరలివస్తున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## లీగల్ డ్రామా కాదు.. క్లాస్ డివైడ్‌పై వార్.. వైరలవుతున్న సిస్టమ్ ట్రైలర్



బాలీవుడ్‌లో కోర్ట్‌రూమ్ డ్రామాలకు ఎప్పుడూ ప్రత్యేకమైన ఆదరణ ఉంటుంది. కానీ ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సిస్టమ్ వెబ్ సిరీస్ మాత్రం సాధారణ లీగల్ డ్రామా కాదనే అభిప్రాయం ట్రైలర్ రిలీజైన వెంటనే బలపడింది. ఈ ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. డైరెక్టర్ అశ్వినీ అయ్యర్ తివారీ ఈ సిరీస్‌ను కేవలం కోర్ట్ కేసుల చుట్టూ కాకుండా, సమాజంలో ఉన్న వర్గ వివక్ష, అధికారం, అవకాశాల అసమానతలపై నిర్మించినట్లు ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ఇందులో సోనాక్షి సిన్హా, నేహా రాజ్‌వంశ్ అనే పాత్ర పోషిస్తుండగా, కథకు ఆమె ప్రధాన కేంద్రంగా కనిపిస్తోంది. ప్రముఖ లీగల్ ఫర్మ్‌కు చెందిన ఆమె, సంస్థలో భాగస్వామ్య హోదా పొందడానికి వరుసగా పది కేసులు గెలవాలనే టార్గెట్ తో ముందుకెళ్తూ ఉంటుంది. అయితే తన విజయాల కోసం ఆమె తీసుకున్న కీలక నిర్ణయం కథను పూర్తిగా కొత్త మలుపులోకి తీసుకెళ్తుంది. అదే జ్యోతిక పోషిస్తున్న సారికా రావత్ పాత్రను టీమ్‌లోకి తీసుకోవడం. మధ్యతరగతి నేపథ్యం నుంచి వచ్చిన కోర్ట్ స్టెనోగ్రాఫర్‌గా సారికా కనిపించినా, ట్రైలర్‌లో ఆమె పాత్రలో దాగి ఉన్న వ్యక్తిగత ఉద్దేశాలు కథను మరింత తీవ్రంగా మార్చనున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా నేహా- సారికా మధ్య ఏర్పడే అసౌకర్యకరమైన బంధమే ఈ సిరీస్ అసలు బలం అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకరు అధికారం, సంపద, ప్రివిలేజ్‌కు ప్రతీకగా కనిపిస్తే, మరొకరు కష్టాల్లో పెరిగిన సాధారణ మహిళగా నిలుస్తారు. కానీ కేసు ముందుకు సాగేకొద్దీ వారి మధ్య ఉన్న వృత్తిపరమైన సంబంధం వ్యక్తిగత సంఘర్షణగా మారిపోతుందనే అంశాన్ని ట్రైలర్ బాగా హైలైట్ చేసింది. ముఖ్యంగా సారికా, నేహా తండ్రి రవి రాజ్‌వంశ్‌కు ఎదురు నిలబడే సన్నివేశాలు కథలో ఎమోషనల్ డెప్త్ ను పెంచనున్నాయి. ఈ పాత్రలో అశుతోష్ గోవారికర్ కనిపించడం మరో ఆసక్తికర అంశంగా మారింది. డబ్బు, ఇన్‌ఫ్లుయెన్స్, అధికారాల మధ్య సామాన్యుడి గొంతు ఎలా మాయమవుతుందనే సామాజిక వాస్తవాన్ని ఈ సిరీస్ కోర్ట్‌రూమ్ నేపథ్యంతో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. అందుకే ఇది కేవలం లీగల్ థ్రిల్లర్‌గా కాకుండా, భారతీయ సమాజంలో ఉన్న క్లాస్ డివైడ్‌పై ప్రశ్నలు లేవనెత్తే డ్రామాగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. బవేజా స్టూడియోస్ ఈ సిరీస్‌కు హర్మన్ బవేజా, అరుణ్ సుకుమార్, అశ్విని అయ్యర్ తివారి, తస్నీమ్ లోఖండ్వాలా, అక్షత్ ఘిల్డియాల్ కలిసి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. దహాడ్ తర్వాత మరోసారి గంభీరమైన పాత్రలో సోనాక్షి సిన్హా ఇందులో కనిపించనున్నారు. హిందీ కంటెంట్‌లో జ్యోతికకు కూడా ప్రాధాన్యత పెరుగుతుందని ఈ సిరీస్ నిరూపిస్తోంది. మొత్తం మీద ట్రైలర్ చూస్తే సిస్టమ్ కోర్ట్‌రూమ్‌లో న్యాయం కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు, సమాజంలో నిజం ఎంత బలహీనంగా మారుతుందనే అంశాన్ని గట్టిగా ప్రశ్నించే సిరీస్‌గా నిలిచే సూచనలు కనిపిస్తున్నాయి.

## అలియా భట్ కి ఘోర అవమానం.. ఫ్యాన్స్ ఫైర్!



కాలం మారుతున్న కొద్దీ అటు అభిమానులలోనే కాదు ఇటు సెలబ్రిటీలలో కూడా అభిరుచులు మారిపోతున్నాయి. ప్రాంతీయంగానే పరిమితం కాకుండా ఎల్లలు దాటుతూ..తమ ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే టాలీవుడ్ ని మొదలుకొని బాలీవుడ్ వరకు ఎంతో మంది భామలు అంతర్జాతీయ వేదికలపై కనిపించి సందడి చేస్తున్నారు. ఇక్కడ భిన్న భిన్నమైన వస్త్రధారణ తో, జువెలరీతో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నారు. ఇంకొంత మంది గ్లామర్ తో కట్టిపడేసే ప్రయత్నం చేసినా.. అనుకోకుండా జరిగే తప్పిదాల వల్ల వారికి అవమానం జరుగుతోంది అనే కామెంట్లు కూడా సోషల్ మీడియా ద్వారా వ్యక్తమవుతున్నాయి. అందులో భాగంగానే బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో బార్బీ గర్ల్ గా గుర్తింపు తెచ్చుకున్న అలియా భట్ కి అంతర్జాతీయ వేదికపై అవమానం జరగడాన్ని చూసి అభిమానులు తట్టుకోలేకపోతున్నారు. అంతటి గొప్ప నటిని పట్టించుకోకపోవడం ఏంటి అంటూ పెదవి విరుస్తున్నారు. అసలు విషయంలోకి వెళితే.. ఇటీవల ఫ్రాన్స్ లో 79వ కేన్స్ ఫిలిం ఫెస్టివల్ ఘనంగా జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫ్యాషన్ ప్రియులు ఈ రెడ్ కార్పెట్ పై నడిచి అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే వివిధ దేశాలకు చెందిన ప్రముఖులతోపాటు ఇండియాకి చెందిన పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలు కూడా ఈ రెడ్ కార్పెట్ పై నడుస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే బాలీవుడ్ నుండి అక్కడికి వెళ్లిన అలియా భట్ తన అంద చందాలతో అక్కడివారిని కట్టిపడేసే ప్రయత్నం చేసింది. అందులో భాగంగానే.. బ్రాండ్ ప్రమోషన్స్ లో భాగంగా లేత గులాబీ రంగు గౌనులో కనిపించి.. అందరిని ఆకట్టుకుంది. తమారా రాల్ఫ్ రూపొందించిన.. బస్టియర్ నెక్ లైన్ కలిగిన డ్రెస్ ధరించి మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా షోల్డర్ లెస్ గౌనులో.. శరీర ఆకృతికి సరితూగేలా ధరించిన ఈ డ్రెస్సు అందరిని ఆకట్టుకుంది. ముఖ్యంగా దీనికి కాంబినేషన్లో దుపట్టాను ఆమె చేతులపై పట్టుకొని ఆ రూపానికి భారతీయ కలను జోడించింది. ఇక నెక్ ను బోసిగా ఉంచకుండా తన గౌనుకి కాంబినేషన్లో లేత గులాబీ రంగు రాళ్లు పొదిగిన నెక్ పీస్ ధరించి మరింత హుందాగా కనిపించింది . ఈ డ్రెస్ లో రెడ్ కార్పెట్ పై అలా వయ్యారంగా నడుస్తూ అందరి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేసింది. కానీ కెమెరామెన్లు మాత్రం అలియా భట్ ను పట్టించుకోకపోవడం గమనార్హం. అందుకు సంబంధించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెడ్ కార్పెట్ పై చాలా కాన్ఫిడెంట్ గా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకోవడానికి అలియా భట్ ఎంత శ్రమించినా సరే అక్కడి ఫోటోగ్రాఫర్లు ఇంకొక విదేశీ యువతిపై ఫోకస్ పెట్టడం చూసి సినీ ప్రముఖులు కూడా ఆశ్చర్యపోతున్నారు.

## టబు సింగిల్ గా ఉండటానికి కారణం వాళ్లేనా?



వెర్సటైల్ నటి టబు – అజయ్ దేవగన్ మధ్య ఉన్న స్నేహం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు కలిసి ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. అయితే 50 ఏళ్లు దాటినా టబు ఇంకా పెళ్లి చేసుకోకుండా సింగిల్‌గా ఉండటంపై బాలీవుడ్ సహా టాలీవుడ్ మీడియాలో తరచూ చర్చ జరుగుతూనే ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన టబు తాను ఇంకా పెళ్లి చేసుకోకపోవడానికి అజయ్ దేవగనే ప్రధాన కారణమని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టబు – అజయ్ దేవగన్ చిన్నప్పటి నుండే స్నేహితులు. అజయ్, టబు కజిన్ అయిన సమీర్ ఆర్యకు పక్కింటి అబ్బాయి ప్రాణస్నేహితుడు. టబు ఎదుగుతున్న క్రమంలో అజయ్ .. సమీర్ ఇద్దరూ ఆమెపై నిరంతరం నిఘా ఉంచేవారట. ఎవరైనా అబ్బాయి టబుతో మాట్లాడటానికి ప్రయత్నిస్తే ఇద్దరూ కలిసి వారిని బెదిరించడం ..కొట్టడానికి వెళ్లడం చేసేవారని టబు గుర్తు చేసుకున్నారు. ఆ భయం వల్లే తన దగ్గరకు ఎవరూ రాలేదని అందుకే తాను ఇంకా సింగిల్‌గా ఉండిపోయానని చమత్కరించారు. -అజయ్ – సమీర్ అప్పట్లో పెద్ద రౌడీల్లా ఉండేవారు. నేను ఎవరితోనైనా మాట్లాడుతుంటే చూసి ఊరుకునేవారు కాదు. అజయ్ చేసిన పనికి ఆయన ఇప్పుడు తప్పకుండా పశ్చాత్తాపపడాలి- అని టబు నవ్వేసారు. తాను పెళ్లి చేసుకోకపోవడానికి అజయ్‌ను బాధ్యుడిని చేస్తూనే ఓ సందర్భంలో -నాకో మంచి సంబంధం చూసి పెళ్లి చేయమని అజయ్‌నే అడిగాను- అని వెల్లడించారు. ఇద్దరి మధ్య ఉన్న విడదీయలేని అనుబంధం ఈ వ్యాఖ్యల తో మరోసారి స్పష్టమవుతోంది. సినిమా ఇండస్ట్రీలో నటీనటుల మధ్య సంబంధాలు ఎప్పుడు ఎలా ఉంటాయో చెప్పడం కష్టం. కానీ టబు అజయ్ మాత్రం 25 ఏళ్లుగా ఒకే రకమైన సాన్నిహిత్యాన్ని కొనసాగిస్తున్నారు. -విజయ్‌పథ్- నుండి ప్రారంభమైన ఇద్దరి ప్రయాణం -దృశ్యం-, -గోల్‌మాల్ అగైన్-, -భోలా- వంటి చిత్రాల వరకు విజయవంతంగా సాగుతోంది. తెరపై వీరి కెమిస్ట్రీ ఎంత బాగుంటుందో? వ్యక్తిగత జీవితంలోనూ ఒకరిపై ఒకరికి అంతటి గౌరవం , రక్షణ భావం ఉందని టబు అనేక సందర్భాల్లో రివీల్ చేసారు. అజయ్ దేవగణ్ గురించి మరిన్ని విషయాలు చెప్పారు. -నేను ఇండస్ట్రీలో ఎవరినైనా గుడ్డిగా నమ్మగలను అంటే అది అజయ్‌నే. ఆయన నా పట్ల ఎంతో కేరింగ్‌గా ఉంటారు. షూటింగ్ సెట్స్‌లో అజయ్ ఉంటే నాకు చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది- అని అన్నారు. పెళ్లి గురించి ఎన్ని ప్రశ్నలు ఎదురైనా? తన స్నేహితులతో గడిపే సమయమే తనకు అత్యంత సంతోషాన్నిస్తుందని నమ్ముతారు. అజయ్ సరదాగా చేసిన ఆ బెదిరింపులు తన జీవితాన్ని ఇలా మలుపు తిప్పాయని ఆమె సరదాగా గుర్తు చేసుకుంటారు.

## అథ్లెట్ల కలలకు రెక్కలు తొడిగిన ప్రభాస్!



పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ వెండితెరపైనే కాదు. నిజ జీవితంలోనూ విశాల హృదయాన్ని చాటుకుంటున్నారు. -బాహుబలి- సినిమా కోసం డార్లింగ్ ఎంతగా కష్టపడ్డారో తెలిసిందే. ఆ సినిమా సాధించిన ఘన విజయం అందరికీ విధితమే. అయితే ఆ సినిమా చిత్రీకరణ ముగిసిన తర్వాత ప్రభాస్ చేసిన గొప్ప కార్యం ఇప్పుడు సోషల్ మీడియాలో మరోసారి చర్చనీయాంశమైంది. క్రీడల పట్ల మక్కువ ఉండి సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్న యువ అథ్లెట్లకు ప్రభాస్ అండగా నిలిచారు. -బాహుబలి- సినిమాలో శివుడు , అమరేంద్ర బాహుబలి పాత్రల కోసం ప్రభాస్ తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకోవాల్సి వచ్చింది. ఇందుకోసం ఆయన లక్షల రూపాయల ఖర్చుతో అత్యున్నత ప్రమాణాలు కలిగిన జిమ్ పరికరాలను ప్రత్యేకంగా విదేశాల నుండి తెప్పించుకున్నారు. సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత ఆ ఖరీదైన పరికరాలను తన వద్దే ఉంచుకోకుండా? క్రీడల్లో రాణించాలనుకునే వర్ధమాన అథ్లెట్ల కోసం వాటిని విరాళంగా ఇచ్చి ప్రభాస్ తన గొప్పతనాన్ని చాటుకున్నారు. ప్రభాస్ విరాళంగా ఇచ్చిన ఈ పరికరాలు ప్రస్తుతం అనేకమంది యువ క్రీడాకారుల శిక్షణకు ఉపయోగపడుతున్నాయి. ఖరీదైన జిమ్‌లకు వెళ్లి శిక్షణ పొందే ఆర్థిక స్తోమత లేని అథ్లెట్లకు, ప్రభాస్ అందించిన అంతర్జాతీయ స్థాయి పరికరాలు ఒక వరంగా మారాయి. తన వ్యక్తిగత అవసరాల కోసం కొనుగోలు చేసిన వస్తువులను సమాజ హితం కోసం మళ్లించడం ద్వారా ప్రభాస్ నిజమైన మ్యాన్ ఆఫ్ ది పీపుల్ అని అనిపించుకున్నారు. సాధారణంగా సెలబ్రిటీలు వాడిన వస్తువులను వేలం వేయడం లేదా భద్రపరుచుకోవడం చూస్తుంటాం. కానీ ప్రభాస్ మాత్రం అవి మరొకరి భవిష్యత్తుకు ఉపయోగ పడాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల కష్టాలను గుర్తించి వారికి అవసరమైన మౌలిక వసతులను కల్పించడంలో తన వంతు పాత్ర పోషించడం విశేషం. ఈ చర్య వల్ల ఆయన కేవలం సినిమా అభిమానులనే కాకుండా క్రీడా ప్రేమికుల మనసులను కూడా గెలుచుకున్నారు. ప్రభాస్ చేస్తున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆయన నిరాడంబరతకు అద్దం పడుతున్నాయి. ఏ ప్రచారం కోరుకోకుండా నిశ్శబ్దంగా సహాయం చేయడం ప్రభాస్ నైజం. -బాహుబలి- పరికరాల విరాళం వెనుక ఉన్న ఉద్దేశ్యం క్రీడలను ప్రోత్సహించడమే కాదు. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదనే స్ఫూర్తిని యువతలో నింపడమేనని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతుంటాయి. ప్రభాస్ కేవలం బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడమే కాదు. సామాజిక బాధ్యతలోనూ ముందుంటున్నారు.

ప్రజాలక్ష్యం



# బైకును ఢీకొన్న కారు..ఇద్దరు మృతి

## కారులోని వ్యక్తులు వెంటనే పరార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే13 : హైదరాబాద్ నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బుధవారం మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు మౌలాలికి చెందిన గణెశ్, గంగాధర్‌గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ ప్రతిరోజు కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

మొదటిపేజీ తరువాయి

పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావిం చారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోం మంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

# జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

చూపుతోందని అన్నారు. మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈనెల 21న జరుగనున్న కేబినెట్ సమావేశం నాటికి హైదరాబాద్‌లో ఉన్న అన్ని సొసైటీల పూర్తి వివరాలను, జర్నలిస్టుల సంఖ్యతో కూడిన నివేదికను తయారు చేయాలని అన్నారు. ఇందుకు అన్ని సొసైటీలు సమిష్టిగా సహకరించాలని ఆయన కోరారు. అర్హులైన జర్నలిస్టులను మాత్రమే జాబితాలో చేర్చాలని ఆయన సొసైటీల ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఈ సొసైటీని కూడా పరిగణలోకి తీసుకొని జేఏసీలో చేర్చారు. అదేవిధంగా మహాత్మగాంధీ జర్నలిస్ట్స్ సొసైటీని కూడా చేర్చారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్‌లు తమ సొసైటీ సభ్యుల జాబితా ను సమర్పించారు. ఈ సమావేశంలో ఐఅండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు.పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

మొదటిపేజీ తరువాయి

అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు.ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు. బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భగీరథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ-మెయిల్‌తో పాటు భగీరథ్ ఓ లేఖ పంపించారు.

# ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే రూట్లలో సర్వీసు లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉం టుందని తెలిపింది. నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం ఎయిర్ ఇండియా సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపనుంది. వీటిలో ఉత్తర అమెరికాకు వారానికి 33, ఐరోపాకు 47, యూకేకు 57, ఆస్ట్రేలియాకు 8, ఫార్ ఈస్ట్, ఆగ్నేయాసియా, సార్క్ ప్రాంతాలకు 158 విమానాల చొప్పున నడవనున్నాయి. అలాగే మారిషస్‌కు వారానికి ఏడు విమాన సర్వీసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, నష్టాల దృష్ట్యానే ఎయిర్ ఇండియా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# పొదుపు సూత్రాలు తెలంగాణకు నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

మొదటిపేజీ తరువాయి

మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

# బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫీట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండువర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్, మున్సిపల్ పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు తగిన విస్తీర్ణంలో క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు బక్రీద్ పండుగ అప్రమత్తతో ఉన్నారని స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ తెలిపారు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ చట్టాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కె. ఇలంబర్తి మాట్లాడారు. పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లను ఇచ్చేందుకు వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో వెటర్నరీ డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపీ, శాంతిభద్రతల డీజీపీ మహేశ్ ఎం భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు తగు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలు, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# ములాయం చిన్నకొడుకు ప్రతీక్ హఠాన్మరణం

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. మరణానికి గల కారణాన్ని నిర్ధారించడానికి కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ వైద్యుల బృందం మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించనుంది. ప్రతీక్ యాదవ్.. మూలాయం సింగ్ యాదవ్ రెండో భార్య కుమారుడు. బీజేపీ నాయకురాలు అపర్ణా యాదవ్ భర్త. రాజకీయ కుటుంబంలో జన్మించినప్పటికీ, ప్రతీక్ యాదవ్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ రియల్ ఎస్టేట్, ఫిట్‌నెస్ రంగాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన అకాల మరణం ములాయం సింగ్ యాదవ్ కుటుంబంలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రతీక్ కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధ పడుతున్నారు. దీనికి చికిత్స కూడా తీసుకుంటున్నారు. ఈరోజు ఉదయం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాల్లో యాదవ్ కుటుంబం కీలకంగా ఉన్నప్పటికీ.. ఆయన మాత్రం దూరంగా ఉండేవారు. 2011లో ప్రతీక్-అపర్ణ వివాహం జరిగింది. అయితే ఇటీవల వీరిమధ్య విభేదాలు తలెత్తాయి. అపర్ణ వల్ల తమ కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు దెబ్బతిన్నాయంటూ భార్యపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. వ్యక్తిగత స్వార్థంతో తమ కుటుంబాన్ని ఆమె ధ్వంసం చేశారంటూ జనవరిలో ఆయన చేసిన పోస్టు చర్చనీయాంశమైంది. ఈ బంధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అనుకుంటున్నట్లు, విడాకులు తీసుకుంటానని పేర్కొన్నారు. 2017లో లఖ్‌నవూ కంటోన్మెంట్ స్థానం నుంచి సమాజ్‌వాదీ తరఫున ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అపర్ణ ఓడిపోయారు. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున ప్రచారం చేసిన ఆమె.. ప్రస్తుతం ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. తాజాగా ప్రతీక్‌ను చేర్పించిన ఆసుపత్రి వద్ద అపర్ణ కనిపించలేదు. ప్రతీక్ యాదవ్ ఈ రోజు మన మధ్య లేరు. చిన్న వయసు నుంచే ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ వహించేవాడు. స్వయంకృషితోనే జీవితంలో ఎదగాలని కోరుకునేవాడు. రెండు నెలల క్రితం కలిసినప్పుడు ఆరోగ్యం, వ్యాపార విస్తరణ గురించి మాట్లాడుకున్నాం అంటూ అఖిలేశ్ యాదవ్ విచారం వ్యక్తంచేశారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, భాజపా, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ప్రతీక్ మృతికి సంతాపం తెలియజేశారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

మొదటిపేజీ తరువాయి

సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరఫున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారిగా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు.అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము

# సిఎం రేవంత్‌ను కలిసిన పలువురు ప్రముఖులు

మొదటిపేజీ తరువాయి

ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ రీజినల్ చైర్మన్ రామన్ రఘు, రీజనల్ డైరెక్టర్ జె.వి. రాజగోపాల్ రావు, సైనిక్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్. ఆర్. బాబులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు.

# బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

మొదటిపేజీ తరువాయి

బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ÷ూఎఖీతో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# బండి భగీరథ్ అప్‌స్కాండింగ్

మొదటిపేజీ తరువాయి

నగరంలోని పలు ప్రాంతాల్లో బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని రాసి ఉంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా బండి భగీరథ్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని.. అతడు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. తనపై లైంగిక దాడి చేశాడంటూ భగీరథ్‌పై బాలిక ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందిస్తూ.. తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. దీంతో ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్న సిట్.. భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈరోజు(బుధవారం) మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. మరోవైపు తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ భగీరథ్.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# విపక్షనేతల అంటే లెక్కలేదా ?

మొదటిపేజీ తరువాయి

అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలు బొమ్మగా మారారని దుయ్యబట్టారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' అబద్ధమని... బీజేపీ వికాసం మాత్రమే జరుగుతోందని వీహెచ్ వ్యాఖ్యానించారు

# పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహదపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.



# 'డబుల్ ఇంజిన్' అంటే పేపర్ల లీకేజీయేనా?

**- కేంద్ర అసమర్థతకు నీట్ కుంభకోణమే నిదర్శనం: మంత్రి పొంగులేటి**

**- జీళ్లచెరువు ప్రజా దర్బార్‌లో కేంద్రంపై తీవ్ర విమర్శలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 13 : "డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అభివృద్ధి చేయడమా.. లేక పేపర్లు లీక్ చేసి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడమా?" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనంగా అభివర్ణించారు. నీట్ పరీక్షకు 42 గంటల ముందే ప్రశ్నాపత్రాలు బయటకు రావడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న మంత్రి, దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థులు, తెలంగాణలో 70 వేల మంది విద్యార్థులు ఈ కుంభకోణంతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏమీ జరగనట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరిచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సరికాదన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై కూడా మంత్రి విమర్శలు చేశారు. గత పదేళ్ల పాలనలో గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పలు నియామక పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని ఆరోపించారు. ఆనాటి ప్రభుత్వ మంత్రుల పీఏలే జిరాక్స్ సెంటర్లలో పేపర్లు అమ్మారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇంటర్ ఫలితాల తారుమారుతో 28 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను గుర్తుచేస్తూ, నేటి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియామక సంస్థలను ప్రక్షాళన చేసి పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. అనంతరం జీళ్లచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలకు సంబంధించిన వినతులను పరిశీలించి, న్యాయమైన ప్రతి సమస్యను శాతం వందకు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.



# ప్రతి కళాకారుడికి గుర్తింపు కార్డు ఇవ్వాలి

**- ప్రజా కళలకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం**

**- తెలంగాణ ప్రజానాట్యమండలి మహాసభలో డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి-భువనగిరి, మే 13 : అర్హులైన ప్రతి కళాకారుడికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేయాలని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో వర్రె సాయిలు అధ్యక్షతన తెలంగాణ ప్రజానాట్యమండలి భువనగిరి మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా కళలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా కళాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి నెలవారీ ఆర్థిక సహాయం, గుర్తింపు కార్డులు, ఆరోగ్య బీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బుర్రకథ, ఒగ్గుకథ, డప్పు కళ, ప్రజా గీతాలు, నాటక రంగం వంటి సంప్రదాయ కళారూపాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో సాంస్కృతిక చైతన్యం పెంపొందించేందుకు ప్రజానాట్యమండలి నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈనెల 24న ఆలేరు పట్టణంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా మూడో మహాసభలో కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, మహాసభను విజయవంతం చేసేందుకు కళాకారులు, ప్రజాసంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వర్రె సాయిలు, ఉపాధ్యక్షుడిగా దాసరి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా రాళ్లబండి భాగ్యమ్మ, కోశాధికారిగా గుండ్ల స్వామిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు, సీపీఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల కార్యదర్శి లక్ష్మయ్య, నాయకులు లక్ష్మి, అండాలు, నిర్మలాదేవి, మల్లమ్మ, యాదమ్మ, వాణి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- రవాణా, గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు**

**- కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ అంకిత్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 13 : జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇల్లందు వ్యవసాయ కమిటీ, చల్లసముద్రం, టేకులపల్లి, బోడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించి కొనుగోలు, నిల్వ, లోడింగ్, రవాణా ప్రక్రియలపై సమీక్ష నిర్వహించారు. ఇల్లందు కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 54 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. గోదాముల్లో సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని వివరించారు. లోడింగ్ పనులను వేగవంతం చేసి రోజువారీ చెల్లింపులు వెంటనే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిల్వ స్థలాల కొరత నివారణకు గిరిజన భవనాలు, కళాశాలల ఫంక్షన్ హాళ్లను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. చల్లసముద్రం కేంద్రంలో రైతులు లారీలు, గన్ని బ్యాగుల కొరతపై సమస్యలు తెలియజేయగా వెంటనే స్పందించిన కలెక్టర్ రవాణా శాఖ అధికారులతో మాట్లాడి తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని, మార్క్‌ఫెడ్ ద్వారా 50 వేల గన్ని బ్యాగులు సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం అక్కడ 17 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. టేకులపల్లి కొనుగోలు కేంద్రంలో సుమారు 1.50 లక్షల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ నిల్వల కోసం టేకులపల్లి ఉన్నత పాఠశాల, పెట్రాల చిలకలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం 148 మంది హమాలీలు అందుబాటులో ఉన్నారని అధికారులు వివరించారు. బోడు కొనుగోలు కేంద్రంలో 6 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉండగా, గత మూడు రోజులుగా ట్రాక్టర్లతో వేచి ఉన్నామని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ట్రాక్టర్లలోని మొక్కజొన్నను కొత్తగూడెం మార్కెట్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి రవాణా, గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకుని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్ అధికారి నరేందర్, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగ

**- సైబర్ మానిటరింగ్‌తో పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నాం.**

**- బక్రీద్ నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ వీడియో కాన్ఫరెన్స్‌లో**

**- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 13 : రాబోయే బక్రీద్ పండుగను జిల్లాలో శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, అన్ని సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, పశువుల అక్రమ రవాణా నివారణపై తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగను ప్రజలు పరస్పర సహకారంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈద్గాలు, మసీదులు, ప్రార్థనా స్థలాలు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు వంటి జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పండుగ రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, ఈద్గాల వద్ద పార్కింగ్ సౌకర్యాలు, ట్రాఫిక్ మళ్లింపులు, అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చెందకుండా సైబర్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని డీజీపీ ఆదేశించారు. ఎలాంటి అనుమానాస్పద సమాచారం వచ్చినా వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి సామరస్య వాతావరణంలో పండుగ జరగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో 24 గంటల పాటు సిబ్బంది విధులు నిర్వహించాలని, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమన్వయం పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరం




**- బీజేపీ విజయాల వెనుక అనేక పార్శ్వాలు దాగి ఉన్నాయి**

**- సీపీఐ జాతీయ సమితి సభ్యులుబాగం హేమంతరావు**

**- సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 13 : ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరమని, కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల విజయాలను బీజేపీ పాలనకు ప్రజల సంపూర్ణ మద్దతుగా భావించలేమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో పావులూరి మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ విజయాల వెనుక ఓట్ల తొలగింపు, ఎన్నికల కమిషన్ వ్యవహార శైలి, ప్రలోభాలు వంటి అనేక అంశాలు దాగి ఉన్నాయని ఆరోపించారు. దేశంలో ధరలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా, "అన్నీ కర్మ ఫలితమే" అన్న భావజాలాన్ని ప్రజల్లో నాటే ప్రయత్నం బీజేపీ చేస్తోందని విమర్శించారు. హిందుత్వ నినాదంతో ప్రజల మధ్య విభజన సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. లేబర్ కోడ్స్, 'వికసిత్ భారత్' తరహా పథకాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలని హేమంతరావు పేర్కొన్నారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు పోరాటాలు కొనసాగిస్తున్నారని, ఢిల్లీ పరిసరాల్లో కూడా ఉద్యమాలు ఉధృతమవుతున్నాయని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, ఈనెల 15 నుంచి పథకం పరిరక్షణ కోసం దశలవారీ ఆందోళనలు చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్న ఆయన, రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం, ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని, రెండు నెలలు దాటినా రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ కాలేదని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో క్వింటాకు 10 కిలోల వరకు కోత విధిస్తున్నారని, రవాణా, ఎగుమతి ఖర్చులు కూడా రైతులపై భారమవు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించిన హేమంతరావు, రైతుల ఇబ్బందులను తొలగించేందుకు విస్తృత స్థాయిలో కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ, ప్రజా సంఘాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టగా, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# 50వ డివిజన్ బాటలో సమస్యల పరిష్కారం

**- పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ - మేయర్ మహంకాళి స్వామి**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటీ (గోదావరిఖని), మే 13 : ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వారం క్రితం నగర మేయర్ మహంకాళి స్వామి నేతృత్వంలో నిర్వహించిన ''డివిజన్ బాట'' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ , మున్సిపల్ అధికారులు సిబ్బందితో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. మార్కండేయ కాలనీలో చాలా రోజులుగా ప్రధాన మంచినీటి పైప్‌లైన్ లీకేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో స్థానిక ప్రజలు 50వ డివిజన్ కార్పొరేటర్ ధూళికట్ట సతీష్ ఈ సమస్యను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నగర మేయర్ మహంకాళి స్వామి ల దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన మున్సిపల్ నీటి విభాగం అధికారులు, సిబ్బంది నిన్నటి ఉదయం నుంచే మరమ్మత్తు పనులను ప్రారంభించి బుధవారం తెల్లవారుజాము వరకు నిరంతరంగా పనిచేసి సమస్యను పూర్తిగా పరిష్కరించారు. ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతర మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవడంతో, పని జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన నీటి విభాగం సిబ్బందిని, డివిజన్ ఎఇ, ఎస్ఇలను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ, సమస్య పరిష్కారంలో కీలక పాత్ర పోషించిన నగర మేయర్ మహంకాళి స్వామిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ "వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం" అని తెలిపారు. త్వరితగతిన స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి, నగర మేయర్ మహంకాళి స్వామి, మున్సిపల్ అధికారులకు సిబ్బందికి 50వ డివిజన్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలి

**- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**- పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 13 : కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై త్వరితగతిన కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం పాలేరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియ, రైతులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతు వివరాలు, వారు తీసుకువచ్చిన ధాన్యం వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, తేమ శాతం పరిశీలించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని, టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గోనె సంచులు, వెయింగ్ మిషన్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ఓపీఎంఎస్‌లో నమోదు చేసి రైతులకు చెల్లింపులు త్వరగా జరిగేలా చూడాలని చెప్పారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ధాన్యం రవాణాకు ముందస్తుగా వాహనాలను సిద్ధం చేసి, కొనుగోలు అనంతరం వెంటనే మిల్లులకు తరలించేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఇన్‌చార్జ్ మేనేజర్ సునీల్ రెడ్డి, డీఆర్‌డీవో శ్రీరాం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, కూసుమంచి తహసీల్దార్ సైదులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపల్లెను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం

**- గ్రామీణ రహదారుల నిర్మాణంతోనే నిజమైన అభివృద్ధి సాధ్యం -రూ. కోటి వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే కూనంనేని శంకుస్థాపన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 13 : గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి పల్లెను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సర్వారం గ్రామపంచాయతీ పరిధిలోని కంకరమిల్లు నుంచి గోపతండా వరకు రూ. 1 కోటి వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, మారుమూల గ్రామాలకు మెరుగైన రహదారులు అందించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బీటీ, సీసీ రోడ్ల సౌకర్యం కల్పించాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com